teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 347 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 9 మే 2025 | పేజీలు : 08 | వెల ‘5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## భారత సైన్యానికి సంఘీభావంగా సీఎం రేవంత్ రెడ్డి ర్యాలీ

సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ

పాల్గొన్న ఆర్మీ, పోలీసులు, అధికారులు, మంత్రులు






ప్రపంచవ్యాప్తంగా

“చార్మినార్, లాడ్ బజార్ కు”

## గుర్తింపు

ఈ నెల 13న నగరంలోని హెరిటేజ్ వాక్




## ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

ఆస్పత్రుల్లో పని చేసే డాక్టర్లు, సిబ్బందికి సెలవులు రద్దు

# పాక్ చానళ్లపై నిషేధం

పాకిస్తాన్ మూలాలు కలిగిన కంటెంట్‌ను నిలిపివేయాలి




ఓటీటీ, మీడియా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై కేంద్రం ఫోకస్

జాతీయ భద్రత దృష్ట్యా ప్రసార మంత్రిత్వ శాఖ సలహా జారీ

న్యూ ఢిల్లీ, మే 08 (తీన్మార్ న్యూస్): పాకిస్తాన్ మూలాలు కలిగిన వెబ్-సిరీస్, సినిమాలు మరియు ఇతర కంటెంట్‌లను తక్షణమే నిలిపివేయాలని ప్రభుత్వం ఓటీటీ మరియు మీడియా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు భారతదేశంలో పనిచేస్తున్న మధ్యవర్తులను కోరింది. పహల్గామ్ ఉగ్రవాద దాడి దృష్ట్యా జాతీయ భద్రత దృష్ట్యా సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ ఈరోజు వారికి ఒక సలహా జారీ చేసింది. సబ్‌స్క్రిప్షన్ ఆధారిత మోడల్‌లో అందుబాటులో ఉంచినా లేదా మరేదైనా అందుబాటులో ఉంచినా, పాకిస్తానీ వెబ్-సిరీస్, సినిమాలు, పాటలు, పాడ్‌కాస్ట్‌లు మరియు ఇతర స్ట్రీమింగ్ మీడియా కంటెంట్‌ను స్ట్రీమింగ్ చేయడాన్ని నిలిపివేయాలని మంత్రిత్వ శాఖ వారికి సూచించింది.




## సరిహద్దుల్లో భారత్ - పాకిస్తాన్ బలగాల మధ్య కాల్పులు

పాకిస్తాన్‌లోని రావల్పిండి ఆర్మీ హెడ్‌క్వార్టర్‌పై డ్రోన్ దాడి

రూ.1600 కోట్ల మేర ధ్వంసం చేసిన భారత బలగాలు

s-400 పాక్ మిస్సైల్స్‌ను నిర్వీర్యం చేసిన భారత్



న్యూ ఢిల్లీ, మే 08 (తీన్మార్ న్యూస్): దేశ సరిహద్దుల్లో ఆపరేషన్ సిందూర్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇప్పటివరకు ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్తాన్‌కు చెందిన దాదాపు రూ.1600 కోట్ల విలువజేసే ఆస్తులను భారత బలగాలు ధ్వంసం చేశాయి. తాజాగా పాకిస్తాన్‌లోని రావల్పిండి ఆర్మీ

మిగతా 2 లో

## ఆరు నెలల పాటు కాల్పుల విరమణ

ప్రకటించిన మావోయిస్టు పార్టీ

కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు కూంబింగ్ వేళ కీలక నిర్ణయం

అగ్రనేత జగన్ పేరిట లేఖ విడుదల






## హైదరాబాద్లో హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంభం

ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మే 08 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్య పెరిగిపోయి అక్కడ ప్రజలు జీవించలేని

మిగతా 2 లో

ఆపరేషన్ సిందూర్ పై దుష్ప్రచారం చేస్తే

## కఠిన చర్యలు

హెచ్చరించిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

ఎక్స్ ఖాతాలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోస్ట్




తెలంగాణ బ్యూరో, మే 08 (తీన్మార్ న్యూస్): ఆపరేషన్ సిందూర్ పై దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరించింది. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసినా, పోస్టులు పెట్టినా కఠిన చర్యలు ఉంటాయని

మిగతా 2 లో

ఉచిత బస్సు పథకంపై ఆర్టీసీ ఎండీ

## కీలక వ్యాఖ్యలు

ప్రభుత్వాలు జారీ చేసిన ఐడీలతో టికెట్స్ పొందొచ్చు

ఓ నేటిజన్ ప్రశ్నకు.. సమాధానంగా స్పష్టం



హైదరాబాద్, మే 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం (మహాలక్ష్మి పథకం) కల్పించింది. ఈ పథకం తెలంగాణ మహిళలకు అందరికీ వర్తింపజేశారు. రోడ్డు రవాణా సంస్థ ఆద్వర్యంలో నడిచే అన్ని పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఆధార్ కార్డుతో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు. ఈ ఉచిత

మిగతా 2 లో





## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక ప్రకటన

రోహింగ్యాల విషయంలో తెలంగాణ చర్యలు తీసుకోవాలి

సీఎం రేవంత్ రెడ్డి ప్రధానంగా దృష్టి పెట్టాలి: పవన్ కళ్యాణ్

## ఐపీఎల్ -2025 సీజన్‌ను రద్దు చేయాలనే ఆలోచనలో బీసీసీఐ

భారత్- పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యమే కారణం







## కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై హరీష్ రావు మరోసారి ఫైర్

ఇరిగేషన్ శాఖలో ఎంపికైన అభ్యర్థుల పరిస్థితిపై ఎక్స్ వేదికగా పోస్ట్

# ప్రపంచవ్యాప్తంగా చార్మినార్, లాడ్ బజార్‌కు గుర్తింపు

హైదరాబాద్, మే 08 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లో నిర్వహించే మిస్ వరల్డ్ ఈవెంట్ తో చార్మినార్, లాడ్ బజార్ లకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు దక్కనుంది. మిస్ వరల్డ్ ఈవెంట్‌లో భాగంగా ఈ నెల 13న సాయంత్రం హైదరాబాద్ నగరంలోని చార్మినార్, లాడ్ బజార్‌లలో హైదరాబాద్‌తో పాటు చార్మినార్, లాడ్ బజార సాంస్కృతిక వైభవాన్ని, వైవిధ్యాన్ని చారిత్రక ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేసేలా హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నారు. లాడ్ బజార్‌లో మిస్‌వరల్డ్ ప్రతినిధులు స్థానిక కళాకారులతో మాట్లాడనున్నారు. 120 దేశాల మిస్‌వరల్డ్ ప్రతినిధులు హాజరయ్యే ఈ హెరిటేజ్ వాక్‌ను 150 కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఈ ఈవెంట్‌ను తిలకిస్తారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున విదేశీ పర్యాటకులను తెలంగాణకు ఆకర్షించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. చారిత్రక చార్మినార్ కట్టడం, లాడ్‌బజార్ ప్రత్యేకతలను మిస్ వరల్డ్ ప్రతినిధులు వివరించి వరల్డ్ టూరిస్ట్ డెస్టినేషన్ స్పాట్‌గా ప్రమోట్ చేయనున్నారు.

**లాడ్ బజార్ ప్రత్యేకత**

నిజాం పాలనలో వెలసిన లాడ్ బజార్‌కు 400 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. బాంగిల్స్ రాజధానిగా ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. రంగురంగుల పేర్లు, మణులు, జరీ పనితో కూడిన సాంప్రదాయిక గాజులు ఇక్కడి ప్రత్యేకత. ప్రతి పెళ్లి సీజన్లో ఇది జనాల ఆకర్షణ కేంద్రం ఉంటుంది. ఇక్కడ నాణ్యమైన ముత్యాలు, నగలు సరసమైన ధరల్లో లభిస్తాయి. హస్తకళల హబ్‌గా కూడా పేరుంది. చిత్రకళ, నకాశీ పని, ఇస్లామిక్ ఆర్ట్ వంటి సాంప్రదాయిక హస్త శిల్ప వస్తువులు ఇక్కడ లభిస్తాయి. ఇత్తార్ (సువాసనలు), ఖురాన్ ప్రతులు, సాంస్కృతిక వస్తువులతో ఇది ఇస్లామిక్ ఆర్ట్‌కి ప్రతీకగా నిలిచింది. ఓల్డ్ సిటీ ఇటుకల రోడ్లు, సజీవమైన దుకాణాలు, సాంస్కృతిక సువాసనలు ప్రతి ఒక్కరినీ ముగ్ధులను చేస్తాయి.



**చార్మినార్ ప్రత్యేకత**

1591లో కుతుబ్ షాహీ రాజు ముహమ్మద్ కులీ కుతుబ్ షా నిర్మించిన చార్మినార్, హైదరాబాద్ సాంస్కృతిక గర్వాన్ని ప్రతిబింబిస్తోంది. నాలుగు మినార్లతో కూడిన ఈ స్మారకం ఇండో-ఇస్లామిక్ డిజైన్‌కు నిదర్శనం. ప్లేగు నివారణ తర్వాత నగర స్థాపనకు గుర్తుగా నిర్మించబడింది. 56 మీటర్ల ఎత్తు, 45 మీటర్ల వెడల్పుతో ఇది హైదరాబాద్ కు హార్ట్ గా ఉంది. మినార్లపై నుంచి పాత నగరం, మక్కా మసీదు అద్భుత దృశ్యాలు కనిపిస్తాయి. ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తింపు కోసం ప్రతిపాదించబడింది. ఇది నిజాం కాలం నుంచి నేటి వరకు హైదరాబాద్ ఐకాన్‌గా ఉంది.

## బండారు రాజిరెడ్డి మృతి పట్ల కేటీఆర్ సంతాపం ప్రకటన

### సోషల్ మీడియా వేదికగా ట్వీట్



హైదరాబాద్, మే 08 (తీన్మార్ న్యూస్): ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారు రాజిరెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం ప్రకటించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ట్వీట్ పెట్టారు. ఉప్పల్ నియోజకవర్గానికి ఎన్నో సేవలు అందించిన మాజీ ఎమ్మెల్యే బండారు రాజిరెడ్డి మరణం విచారకరమన్నారు. రాజిరెడ్డి ఓ నిబద్ధత కలిగిన ప్రజా నాయకుడిగా ప్రజల మనస్సుల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారని తెలిపారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. కాగా, రాజిరెడ్డి 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఉప్పల్ ఎమ్మెల్యేగా పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిపై గెలుపొందారు. 2014లో ఆయన సోదరుడు బండారి లక్ష్మారెడ్డి ఉప్పల్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అనంతర లక్ష్మారెడ్డి బీఆర్ఎస్‌లో చేరి 2023లో ఎమ్మెల్యేగా గెలిచారు. రాజిరెడ్డి మృతిపట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సంతాపం తెలుపుతున్నారు. నేడు హబ్సిగూడ నుంచి రాజిరెడ్డి అంతిమ యాత్ర ప్రారంభం కానుందని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఉచిత బస్సు పథకంపై ఆర్టీసీ ఎండీ కీలక వ్యాఖ్యలు



మొదటి పేజీ తరువాయి

బస్సు ప్రయాణం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు లబ్ధి పొందుతున్నారు. కాగా ఈ ఉచిత బస్సు పథకం పై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉచితంగా బస్సులో ప్రయాణించే మహిళలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఆధార్, ఓటర్ గుర్తింపు, డ్రైవింగ్ లైసెన్స్‌లను చూపించి ఉచిత టికెట్ పొందవచ్చని స్పష్టం చేశారు. కాగా ఓ నెటిజన్ ఆధార్ కార్డు మాత్రమే వ్యక్తి గుర్తింపు ఐడీ కాదని సోషల్ మీడియాలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ను ట్యాగ్ చేసి ప్రశ్నించగా అతనికి సమాదానంగా ఈ విషయం చెప్పారు. ఆధార్ కార్డు లేని వారు తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహిళలు ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్‌లను చూపించి ఉచిత టికెట్ తీసుకుని ప్రయాణించవచ్చని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పష్టం చేశారు.

## ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం





తెలంగాణ బ్యూరో, మే 08 (తీన్మార్ న్యూస్): పహల్గామ్ ఉగ్రదాడి ఘటనకు సంబంధించి భారత సైన్యం పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో మెరుపు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో భారత్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ఏపీలోని కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో నడిచే జిల్లా, ప్రాంతీయ, సామాజిక ఆస్పత్రుల్లో పని చేసే డాక్టర్లు, ఇతర సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. ఈ క్రమంలో వైద్యులకు పలు కీలక సూచనలు చేశారు. అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని హాస్పిటల్ సూపరిటెండ్‌లకు సూచించింది. అత్యవసర సమయంలో ఎలా వైద్యం అందించాలనే దానిపై మాక్ డ్రిల్ నిర్వహించాలని తెలిపారు. ఆక్సిజన్ సదుపాయాన్ని మెరుగుపరచాలని ఉన్నతాధికారులు వైద్యులను ఆదేశించారు. ఇక, తెలంగాణలో మెడికల్ కాలేజీలు, హాస్పిటల్స్ లోని స్టాఫ్‌ల సెలవులను రద్దు చేసింది. అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని హాస్పిటల్ సూపరిటెండ్‌లకు సూచించింది. ప్రభుత్వ ఉద్యోగులు సెలవులు రద్దు చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## సరిహద్దుల్లో భారత్ - పాకిస్తాన్ బలగాల మధ్య కాల్పులు



మొదటి పేజీ తరువాయి

హెడ్‌క్వార్టర్‌పై డ్రోన్ దాడి చేశారు. S-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌తో పాక్ మిస్సైల్స్‌ను భారత్ నిర్వీర్యం చేసింది. చైనా నుంచి పాక్ తెచ్చుకున్న HQ 9 క్షిపణి రక్షణ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రజలంతా సురక్షితంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. పాకిస్తాన్‌లో పర్యటిస్తున్న అమెరికా యాత్రికులు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, వీలైతే దేశం విడిచి వెళ్లాలని సూచనలు చేస్తోంది. ప్రస్తుతం లాహోర్‌లోని ఎయిర్‌పోర్టు పరిసరాలను ఖాళీ చేయిస్తున్నారు. మరోవైపు సరిహద్దుల్లో భారత్ - పాకిస్తాన్ బలగాల మధ్య కాల్పులు చోటుచేసుకుంటున్నాయి.

## ఆరు నెలల పాటు కాల్పుల విరమణ

తెలంగాణ బ్యూరో, మే 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు కూంబింగ్ ముమ్మరం చేసిన వేళ మావోయిస్టు పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఆరు నెలల పాటు కాల్పులు విరమిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు గురువారం సాయంత్రం మావోయిస్టు పార్టీ అగ్రనేత జగన్ పేరిట లేఖ విడుదలైంది. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు, ప్రజాస్వామికవాదులు, ప్రజా సంఘాలు, మెజార్టీ రాజకీయ పార్టీలు మావోయిస్ట్ పార్టీకి, ప్రభుత్వానికి నడుమ శాంతి చర్చలు జరగాలనే డిమాండ్‌ను ప్రముఖంగా చేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టికొని మా నుండి 6 నెలల వరకు కాల్పుల విరమణను పాటిస్తున్నామని ప్రకటించుచున్నాము. అని లేఖలో పేర్కొన్నారు.

## హైదరాబాద్లో హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంభం



మొదటి పేజీ తరువాయి

పరిస్థితి నెలకొందని అన్నారు. ఢిల్లీలో పాటు దేశంలోని అనేక మెట్రో పాలిటన్ నగరాల్లో జీవించలేని పరిస్థితులు ఉన్నాయని ఎట్టి పరిస్థితుల్లో హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రాకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైడ్రా అంటే ఇళ్లు కూల్చేది అన్నట్లుగా కొందరు దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. హైడ్రా అంటే ప్రజల ఆస్తులు రక్షించేది, ఇది ప్రజలు గుర్తించాలని అన్నారు. చిన్న వర్షం పడితే హైదరాబాద్ నగరం మొత్తం అల్లకల్లోలం అవుతుంది. ఇంటి నుంచి కాలు బయటపెట్టే పరిస్థితి ఉండదు కాలనీలన్నీ చెరువులను తలపిస్తాయని గుర్తుచేశారు. భవిష్యత్‌లో అలాంటి పరిస్థితి ఏర్పడొద్దనే ఉద్దేశంతో హైడ్రాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా, రాష్ట్రంలో భూ కబ్జాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలను అరికట్టేందుకు ప్రభుత్వం హైడ్రా వ్యవస్థను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీని పరిధిని మరింత విస్తరించేలా ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ స్టేషన్‌లో ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు, 12 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు, 30 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై హరీష్‌రావు మరోసారి ఫైర్



హైదరాబాద్, మే 08 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు మరోసారి ఫైర్ అయ్యారు. ఇరిగేషన్ శాఖలో 224 ఏఈ, 199 జెటివోలుగా ఎంపికైన అభ్యర్థుల పరిస్థితిని వివరిస్తూ ప్రభుత్వంపై ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన తన ట్వీట్‌లో దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వని చందంగా ఉంది ఇరిగేషన్ శాఖలో 224 ఏఈ, 199 జెటివోలుగా ఎంపికైన అభ్యర్థుల పరిస్థితి. కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన సంబురం లేకుండా చేస్తున్నది దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వం పది రోజుల్లో ఐదు సార్లు నియామక పత్రాల అందజేత కార్యక్రమాన్ని వాయిదా వేసి, వారి జీవితాలతో ఆడుకోవడం శోచనీయం.

కొండంత సంతోషంతో హైదరాబాద్‌కు రావడం, నిరాశతో వెనుతిరిగి పోవడం విద్యార్థుల వంతు అవుతుంది. పెళ్ళి పేరు చెప్పి, పదో తరగతి ఫలితాలు వాయిదా వేయడం, పూటకో కారణం చెబుతూ, నియామక పత్రాలు అందజేయకుండా తిప్పి పంపడం ఈ ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి అలవాటుగా మారింది. ప్రచార ఆర్భాటం పక్కన పెట్టి, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు వెంటనే నియామక పత్రాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. అని రాసుకొచ్చారు. అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్ లో ప్రతిభ చాటి, ఏఈ, జెటివోలుగా నియామక పత్రాలు అందుకోబోతున్న అభ్యర్థులకు మాజీ మంత్రి హరీష్ రావు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆపరేషన్ సిందూర్‌పై దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు


మొదటి పేజీ తరువాయి

వెల్లడించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఎక్స్ ఖాతాలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోస్ట్ చేసింది. ఆపరేషన్ సిందూర్‌పై దుష్ప్రచారం చేసేనట్లుగా మీ దృష్టికి ఏదైనా వస్తే 8712672222కు వాట్సాప్ చేయాలని సూచించింది. కాగా, ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో పోలీసులు హై అలర్ట్ కొనసాగుతోంది. ఓవైపు మిస్‌వరల్డ్ పోటీలు మరోవైపు ఐపీఎల్ మ్యాచ్‌తో మరింత అప్రమత్తమయ్యారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు అణువణువు గాలింపు చర్యలు చేపట్టారు. నగరంలోని మూడు కమిషనరేట్ల సీపీలు శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

## ఐపీఎల్ -2025 సీజన్‌ను రద్దు చేయాలనే ఆలోచనలో బీసీసీఐ

న్యూ ఢిల్లీ, మే 08 (తీన్మార్ న్యూస్): భారత్- పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో బీసీసీఐ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ -2025 సీజన్‌ను రద్దు చేయాలనే ఆలోచనలో పడినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే గురువారం అరుణాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాల మైదానం వేదికగా జరగాల్సిన ఢిల్లీ-పంజాబ్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌తో పాటు ఇతర దేశాల్లో జరుగుతున్న మ్యాచ్‌లను రద్దు చేశారు. ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ప్రకటించారు. తక్షణమే ప్రేక్షకులంతా మైదానం వీడి వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పాకిస్తాన్ మిస్సైళ్లతో ఎటాక్ చేసింది. జమ్మూకశ్మీర్, రాజస్థాన్, పంజాబ్ సహా అనేక ప్రాంతాల్లో దాడులకు పాల్పడుతోంది. భారత సైన్యం కూడా ధీటుగా బదులిస్తోంది. దేశంలోని పలు ప్రాంతాల్లో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు భారత ఆర్మీకి సమాచారం అందించాయి. జమ్మూతో సహా పఠాన్‌కోట్, ఉధమ్‌పూర్‌లలో ఈ దాడులు జరుగుతున్నట్లు సమాచారం. మరోవైపు సాంబా జిల్లాలో పాక్ రేంజర్లు కాల్పులకు తెగబడుతున్నట్లు సమాచారం. పలుచోట్ల భారీగా శబ్దాలు వినిపిస్తున్నాయి. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పలుచోట్ల కరెంటు నిలిపివేశారు.

## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక ప్రకటన



తెలంగాణ బ్యూరో, మే 08 (తీన్మార్ న్యూస్): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తాజాగా కీలక ప్రకటన చేశారు. మయన్మార్‌లో అంతర్యుద్ధం కారణంగా భారత్ లోకి ప్రవేశించి వేర్వేరు నగరాల్లో రోహింగ్యాలు తలదాచుకుంటున్నారు అని పవన్ కళ్యాణ్ తెలిపారు. వారి వల్ల స్థానికుల ఉపాధి దెబ్బతింటుందని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని రోహింగ్యాల విషయంలో తెలంగాణ ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రధానంగా ఈ విషయం పై దృష్టి పెట్టాలి అని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఇదిలా ఉంటే ఇటీవల జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాం లో ఉగ్రదాడికి 26 మంది అమాయకులు మరణించిన విషయం తెలిసిందే. ఈ ఉగ్రవాదుల దాడిలో ఏపీ వాసులు కూడా ఉన్నారు. ఈ క్రమంలో ఆపరేషన్ సిందూర్ పై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ పై బుధవారం హైదరాబాద్ లోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పహల్గాం దుర్ఘటనలో ఏపీకి చెందిన ఇద్దరు చనిపోయారని తెలిపారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ గట్టి సమాధానం చెప్పిందన్నారు. ఇది గర్వించదగ్గ విషయం ఈ సమయంలో పార్టీలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వానికి అంతా మద్దతుగా నిలవాలని పవన్ కళ్యాణ్ సూచించారు.

## భారత సైన్యానికి సంఘీభావంగా సీఎం రేవంత్ రెడ్డి ర్యాలీ

హైదరాబాద్, మే 08 (తీన్మార్ న్యూస్): ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదంపై పోరాటం చేస్తున్న భారత సైన్యానికి సంఘీభావంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ర్యాలీ నిర్వహించారు. గురువారం సాయంత్రం 6:30 గంటలకు హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ఈ ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో పోలీసులు, ఆర్మీ అధికారులు, మంత్రులు, అధికారులతో పాటు పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌తో భారత్ పాకిస్తాన్‌కు సరైన సమాధానం చెప్పిందని అన్నారు. ఇకనైనా పాకిస్తాన్ వక్రబుద్ధి మానుకోవాలని హితవు పలికారు. ఉగ్రవాద చర్యలు ఎవరూ ఉపేక్షించరని అన్నారు. మరోవైపు రాష్ట్రంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అన్ని శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేయాలన్నారు. అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగనీయొద్దన్నారు. హైదరాబాద్‌లోని రక్షణరంగ సంస్థల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.



# తలసీమియా వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన కలిగించాలి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్




మహబూబాబాద్ జిల్లా, మే 08 (తీన్మార్ న్యూస్): క్షేత్రస్థాయి సిబ్బంది తలసీమియా వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన కలిగించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ అన్నారు. ప్రపంచ తలసీమియా దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుండి నెహ్రూ సెంటర్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, టీ హబ్, పాలియేటివ్ కేర్, డిఐఈసిద సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ ర్యాలీని వుద్దేశించి డిఎంహెచ్ఓ మాట్లాడుతూ 2025 ప్రపంచ తలసేమియా దినోత్సవం యొక్క థీమ్ తలసేమియా కోసం కలిసి సమాజాలను ఏకం చేయడం, రోగులకు ప్రాధాన్యత ఇవ్వడం అని ఈ థీమ్ తలసీమియాతో బాదపడుతున్నవారికి మద్దతు ఇవ్వడానికి సమిష్టి ప్రయత్నాల ప్రాముఖ్యతను నొక్కి చెబుతుందన్నారు. జిల్లాలో దాదాపుగా 167 మంది చిన్నారులు తలసీమియా వ్యాధితో బాధపడుతున్నారని, ఇది ఒక జన్యు సంబంధమైనటువంటి వ్యాధి అని, వ్యాధితో బాధపడుతున్నవారు, వారి కుటుంబ సభ్యులు జన్యు పరీక్షలు చేయించుకోవాలని అలాగే మేనరిక వివాహాలు కూడా సరికాదన్నారు. వీరికి తరచుగా రక్త మార్పిడి అవసరము ఉంటుందన్నారు. నెలల వయస్సులోనే ఈ వ్యాధి లక్షణాలను మనం గుర్తించవచ్చునని వీరిలో ఎదుగుదల సరిగా ఉండదని మొహం పీక్కుపోయినట్లుగా ఉండి నీరసంగా ఉంటారని తొందరగా అనారోగ్యం బారిన పడతారన్నారు.

జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వీరికి ప్రతి రెండు మూడు వారాలకు ఒకసారి రక్త మార్పిడి అవసరం ఉంటుందని అలాగే తలసేమియా వ్యాధితో బాధపడుతున్న కుటుంబ సభ్యులు, వివాహం చేసుకోవాలనుకున్నప్పుడు అలాగే గర్భవతి కావాలనుకున్నప్పుడు తప్పనిసరిగా తలసీమియా స్క్రీనింగ్ టెస్ట్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ శ్రవణ్, డాక్టర్ రవీందర్, డాక్టర్ అనిత, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మహబూబాబాద్ సిబ్బంది, టీ హబ్, పాలియేటివ్ కేర్, డిఐఈసిస సిబ్బంది, టీ హబ్ మేనేజర్ అనురాధ, హెచ్ ఈ ఓ కేఎల్ఎన్ స్వామి, రామకృష్ణ, ఆరోగ్య విద్యా బోధకులు కేవి రాజు, హెల్త్ అసిస్టెంట్ లు లింగారెడ్డి, సత్యనారాయణ, సూపర్వైజర్ నాగ బ్రమ్మాచారి, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, ఫిజియో థెరపిస్ట్ లు, డిఐఈసిగ మేనేజర్ విజ్ఞేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పదిలో సత్తా చాటిన గురుకుల విద్యార్థిని ఏంజిల్

అభినందించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.



దేవరకద్ర ప్రతినిధి,మే08(తీన్మార్ న్యూస్) : వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపల్ పట్టణానికి చెందిన గురుకుల విద్యార్థిని ఏంజిల్ పదవ తరగతిలో 562 మార్కులు పొంది ఉత్తమ ప్రతిభ కనపరచినందుకు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏంజిల్ ని అభినందించారు. చిన్నప్పటినుండి చదువులతో పాటు తండ్రి ప్రోత్సాహంతో చెస్ ఆటపై మక్కువ పెంచుకొని సీఎం కప్ మండల స్థాయి,జిల్లా స్థాయిలలో ఉత్తమ ప్రతిభను కనపరచి రాష్ట్రస్థాయిలో ఆడింది.నిరుపేద కుటుంబీకులైన అరుణ విజయ్ శేఖర్ కూతురు ఏంజిల్ కొత్తకోట గురుకులంలో చదువుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించినందుకు నేడు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆమెను అభినందించారు.అందరి ప్రోత్సాహంతో చదువులతో పాటు ఆటలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి మంచి పేరు తీసుకువస్తానని ఏంజిల్ వెల్లడించారు.

## పెద్దమందడి విద్యార్థిని తులసికి కలెక్టర్ ఆదర్శ్ సురభి నుంచి ప్రశంస పత్రం



పెద్దమందడి మే 8 తీన్మార్ న్యూస్ : వనపర్తి జిల్లా స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెద్దమందడి హెచ్ఈసి గ్రూప్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని అల్వాల్ గ్రామ వి.తులసిని కలెక్టర్ శ్రీ ఆదర్శ్ సురభి గురువారం కలెక్టర్ కార్యాలయంలో,ప్రశంసించారు. ఆమెకు ప్రశంస పత్రంతో పాటు మెమెంటోను అందజేశారు. తల్లిదండ్రుల, ఊరి, కళాశాల గౌరవాన్ని నిలబెట్టిన తులసికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆపరేషన్ సింధూర్‌తో పాక్‌కు గుణపాఠం చెప్పిన భారత్

**మోడీ,ఏ చర్య చేపట్టినా 140 కోట్ల భారతీయులు అండగా నిలవాలి**

**అశ్వినీ రాధమ్మ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వనపర్తి**



పెద్దమందడి. మే08: (తీన్మార్ న్యూస్): ఆపరేషన్ విజయవంతం అయిన సందర్భంగా రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు ధన్యవాదములు తెలియజేస్తున్నానని జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆ రాధమ్మ మాట్లాడుతూ

పాక్ లోని ప్రజాప్రతినిదులు, ఉగ్రవాధులను ప్రోత్సహిస్తూ, తీవ్రవాదాన్ని పెంచుతున్నారని మండిపడ్డారు. ఇటీవల కాశ్మీర్ ప్రాంతం పహాల్గం లో పాక్ ఉగ్రవాదులు విచక్షణారహితంగా చేసిన దాడిలో అమాయకులైన 26 మంది భారతీయ హిందువులు చనిపోయారని, మహిళల ముందు మగవారి బట్టలు విప్పి మతం అడిగి, నుదుటన క్రూరంగా కాల్చి చంపి హిందూ మహిళల నుదుటి సిందూరం తుడిచారు. ఈ చర్యను ప్రపంచం అంత ఖండించింది. పహల్గామ్ దాడి అత్యంత హేయమైనదని తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై ప్రపంచ దేశాలను పాక్ తప్పుదారి పట్టిస్తోందని, ఉగ్రవాదానికి పాకిస్థాన్ స్వర్గధామంగా మారిందని అన్నారు. ముంబై దాడుల తర్వాత ఇదే పెద్ద దాడి అని, జమ్మూకశ్మీర్ అభివృద్ధిని అడ్డుకోవడమే ఉగ్రవాదుల పన్నాగమని చెప్పారు. పహల్గామ్ దాడికి దీటైనా చర్యగా, భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ లో భాగంగా భారత సైన్యం పాక్ లోని ఉగ్రవాదుల 9 స్థావరాలపై దాడి చేసి, 80 మంది ఉగ్రవాదులను మట్టుపెట్టిందని అన్నారు. వీర వనితలు పుట్టిన నేల భారతదేశం అని ఆపరేషన్ సింధూర్ లో తొలిసారి ఆర్మీ మహిళలు పాల్గొని త్రివిద దళాల సాక్షిగా మిస్సైల్ల రూపంలో దూసుకెల్లి ఉగ్రమూకలను మట్టుబెట్టారని అన్నారు.ఇప్పటికైనా భారత్ పై పాక్ తీవ్రవాద దాడులను ఆపాలని, లేదంటే భారత సైన్యం తలుచుకుంటే ప్రపంచ పటంలో పాక్ ఉండదని హెచ్చరించారు. అదేవిధంగా ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భంగా, దేశ రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు పార్టీల కతీతంగా, ప్రతి ఒక్కరు పార్టీలకతీతంగా సంఘీభావం తెలపాలని జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అశ్వినీ రాధమ్మ అన్నారు.

## వెనకబడిన కులాల సమైక్య బీసీ ఎఫ్

**రాష్ట్ర కార్యదర్శిగా వాల్మీకి కావలి అశోక్ కుమార్.**




దేవరకద్ర ప్రతినిధి,మే08(తీన్మార్ న్యూస్) : బీసీఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా మదనాపురం మండలం అజ్జకొల్లు గ్రామానికి చెందిన వాల్మీకి కావలి అశోక్ కుమార్ నియమిస్తూ బీసీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నాగనమోని చెన్న రాములు ముదిరాజ్ నియామక పత్రం అందచేశారు.ఈ సందర్భంగా కావలి అశోక్ కుమార్ మాట్లాడుతూ బీసీఎఫ్ యొక్క ఆశయాలకు అంకితమై చిత్తశుద్ధితో పనిచేస్తూ బీసీల రాజ్యాధిరకం కోసం కృషిచేస్తూ. గ్రామ స్థాయి నుండి బీసీఎఫ్ ను బలోపేతం చేస్తూ బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు సాధించి బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ వర్గాల ప్రజలతో కలిసి పోరాడి రాజ్యాధికారం సాధిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ భగవంతు గౌడ్, బీసీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అమడబాకుల రామన్ గౌడ్ మాజీ ఎంపీటీసీ, బీసీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే వెంకటేశ్వర్లు,బీసీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏర్పుల తిరుపతి యాదవ్, ఎస్సీ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బహుజన రమేష్ , బీసీఎఫ్ మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, మైనారిటీ ఫెడరేషన్ వనపర్తి జిల్లా అధ్యక్షులు ఖదీర్ పాషా,కొత్తకోట మండల బీసీఎఫ్ కొత్తకోట మండల అధ్యక్షులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి ప్రతిభ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి


**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, మే 08 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు తమ ప్రతిభను పెంపొందించుకోవడానికి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ప్రతిభా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్ వారి ఆధ్వర్యంలో 30 రోజులపాటు పోటీ పరీక్షల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఇంటర్మీడియట్, ఆపై చదువులు చదివిన నిరుద్యోగులకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈనెల 19న ప్రారంభం కానున్న శిక్షణ కార్యక్రమంలో ఈనెల 19 నుండి 24 వరకు అర్థమెటిక్, 26 నుండి 31 వరకు రీజనింగ్, జూన్ 2 నుండి 6 వరకు జనరల్ ఇంగ్లీష్, 9 నుండి 17 వరకు సామాన్య అధ్యాయనం, 18 నుండి 24 వరకు మాక్ పరీక్షలు, రివిజన్ లలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షల సన్నద్ధం కోసం నైపుణ్యాలు జ్ఞానోదయం పెంపొందించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో సూచించారు.

## సరస్వతి పుష్కరాలలో విధులుకు డ్యూటీ రోస్టర్ సిద్ధం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మే 08 (తీన్మార్ న్యూస్): సరస్వతి పుష్కరాల విధులు నిర్వహణకు డ్యూటీ రోస్టర్ తయారు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం సరస్వతి పుష్కరాల విధులు, పనులు పర్యవేక్షణపై రెవెన్యూ, పంచాయతి రాజ్, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ పుష్కరాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తున్నారని అన్నారు. తహసీల్దార్లు, ప్రోటోకాల్ విధులు, ఎంపీడీఓలు పారిశుధ్య విధులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఘాట్ వద్ద రెండు రోజుల్లో మొత్తం పారిశుధ్య పనులు పూర్తి చేసి పరిశుభ్రం చేయాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలు పర్యవేక్షణ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్యవేక్షణ చేయాలని అన్నారు. పుష్కర విధులు కేటాయించిన అధికారులు శుక్రవారం నుండి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని తెలిపారు. సమయం చాలా తక్కువ ఉందని పనులు, ఏర్పాట్లు. ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. సరస్వతి. మాతా విగ్రహం ప్రారంభోత్సవం, భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా ప్రమాద హెచ్చరికల బోర్డ్స్, ఉచిత అన్నదానం ఇలా ప్రతి అంశాన్ని పర్యవేక్షణ చేసేందుకు నియమించిన అధికారులు శుక్రవారం నుండి పటిష్ట పర్యవేక్షణ చేయాలని, వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

## వనపర్తి రాజప్రసాదం పునరుద్ధరణకు రూపురేఖలు సిద్ధం చేస్తున్న ఆర్కిటెక్చర్ సరయు మోరే



వనపర్తి, మే 08 (తీన్మార్ న్యూస్) : వనపర్తి జిల్లా గౌరవ శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి గారి ప్రత్యేక చొరవతో వనపర్తి రాజప్రసాదం (ప్రస్తుతం పాలిటెక్నిక్ కళాశాలగా వ్యవహరిస్తున్న రాజా గారి బంగ్లా) పునరుద్ధరణకు చర్యలు ముమ్మరమయ్యాయి. గురువారం ముంబైకు చెందిన ప్రముఖ ఆర్కిటెక్చర్ సరయు మోరే వనపర్తి చేరుకుని రాజప్రసాదాన్ని ప్రత్యక్షంగా సందర్శించి, పునరుద్ధరణ అవసరాలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య గార్లు ఆమెకు పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కారం నిర్వహించారు. ఆర్కిటెక్ సరయు మోరే మాట్లాడుతూ, చరిత్రకు శాశ్వత గుర్తుగా నిలిచే నిర్మాణాలను పరిరక్షించుకోవడం సమాజ బాధ్యత. వనపర్తిలోని ఈ రాజప్రసాదం పునరుద్ధరణకు సంబంధించిన పూర్తిస్థాయి నమూనాను త్వరలోనే సిద్ధం చేసి గౌరవ ఎమ్మెల్యే మేఘారెడ్డి గారికి సమర్పిస్తాను అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొంబాయి మన్యంకొండ, చుక్క రాజు, వసీం, ఫాషా, రఘు యాదవ్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ పనితీరు అధికారులకు అవార్డు అందజేత




ములుగు జిల్లా, మే 08 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో పేదరికం నిర్మూలించడానికి ఏర్పాటు చేసిన సొసైటీ లో ఉత్తమ పని తీరును కనపరిచిన ములుగు జిల్లా సెర్ఫ్ అధికారులకు ప్రభుత్వం అవార్డు అందజేసింది. గురువారం హైదరాబాద్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా ఇన్చార్జి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, డిఆర్డిఏ ప్రాజెక్టు అధికారిసంపత్ రావు అవార్డు ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు 2024 ఆర్థిక సంవత్సరంలో 226 కోట్లకు గాను 235 కోట్లను అందించేందుకు గాను రాష్ట్ర స్థాయి లో ఉత్తమ స్థాయిలో ప్రతిభ కనబర్చినందుకు అందించడం జరిగిందని అన్నారు. ఎస్ హెచ్ జి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి సంబంధిత అధికారులు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. రానున్న రోజులలో సంబంధిత అధికారులు ఉత్తమ పనితీరును కనపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్ఫ్ సీఈవో డి. దివ్య, ములుగు జిల్లా అదనపు డిఆర్డిఓ జి. బాలస్వామి, జిల్లాలోని ఎస్ హెచ్ జి మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## పిఎసిఎస్ ఆధ్వర్యంలో గోదాములకు శంకుస్థాపన

**ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి**



పరకాల, మే 08 (తీన్మార్ న్యూస్): గురువారం పిఎసిఎస్ పెంచికలపేట ఆధ్వర్యంలో నీరుకుల్ల గ్రామంలో రూ 90 లక్షల నిధులతో నిర్మించనున్న గోదాములకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి భూమి పూజ, శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, సహకార సంఘాల ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. సన్న రకం ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇస్తుండడంతో యాసంగి సీజన్‌లో కూడా సన్నరకం వరి సాగు పెరిగింది అని అన్నారు. రైతులకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారమని, ఇలాంటి కీలకమైన రంగానికి సేవలందించడంలో పీఏసీఎస్‌లదే ముఖ్య పాత్ర అని అన్నారు. రైతులు ఆర్థికంగా చితికిపోకుండా సహకార సంఘాలు ఎంతో తోడ్పాటును అందిస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో సహకార సంఘాలు నిర్వీర్యమై ఉన్నాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సహకార సంఘాలను చైతన్యపరిచి అనేక రకాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రైతులు పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న గోదాంలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# ఎన్నికల వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలి

## ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కండి.యం. బాల నరసింహ,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

ఆత్మకూర్ మే 08 తీన్మార్ న్యూస్: - కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు యం.బాల్ నరసింహ డిమాండ్ చేశారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలోని వర్తక సంఘం భవనంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వనపర్తి జిల్లా సమితి సమావేశం కామ్రేడ్ మోష అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎం.బాల నరసింహ మాట్లాడుతూ పాకిస్తాన్లో ఉన్నటువంటి ఉగ్రవాదులను అంతమొందిచే విధంగా కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వచర్యలను భారత కమ్యూనిస్టు పార్టీ స్వాగతిస్తుంది కానీ ఇరుదేశాల పౌరులకు ఎలాంటి హాని కలగకుండా చూడాల్సిన బాధ్యత ఇరు దేశాల ప్రభుత్వాలకు ఉందని అన్నారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత వేగంగా ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నారని మండిపడ్డారు. మోడీ పాలనలో సామాన్య ప్రజలు జీవించలేని స్థితి నెలకొన్నదని ఆరోపించారు. చీటికిమాటికి పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ లాంటి నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత కెసిఆర్ ప్రభుత్వం మాదిరిగా మాటలతో కాలం వెళ్లదీయకుండా ఆరు గ్యారంటీల హామీల అమలకు చొరవ




తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ భరత గడ్డపై ఆవిర్భవించి 100 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా గ్రామ గ్రామాల్లో సిపిఐ రాజీలేని పోరాటాలను, వీరోచిత త్యాగాల ఘట్టాలను పార్టీ శ్రేణులకు ప్రజలకు వివరిస్తూ గ్రామస్థాయి నుండి పార్టీ ప్రజాసంఘాల పెంపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఐ శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కే.విజయ రాములు, సిపిఐ జిల్లా నాయకులు జే.చంద్రయ్య,మోష, శ్రీహరి, అబ్రహం, సి.నరసింహ శెట్టి, జీ.రమేష్, గోపాలకృష్ణ, కురుమయ్య,రవీందర్, మాషప్ప, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి కుతుబ్, మహేష్,బాలరాజ్,భరత్, ఏఐటీయూసీ రాష్ట్ర నేత పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో ముగ్గురు జవాన్లు మృతి

### తడపాల గుట్టలపై పేలిన మావోయిస్టుల మందు పాతరలు



ములుగు జిల్లా, మే 08 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని వీరభద్రవరం తడపాల గుట్టలపై మావోయిస్టులు అమర్చిన ఐఈడి పేలి ముగ్గురు గ్రేహౌండ్స్ జవాన్లు మృతిచెందగా వారి మృతదేహాలను ఎంజీఎం మార్చురీకి తరలించిన గ్రేహౌండ్స్ సిబ్బంది. మృతి చెందిన ముగ్గురు శ్రీధర్, సందీప్, పవన్ కళ్యాణ్జవాన్లుగా గుర్తింపు. ఇదే ఘటనలో వరంగల్ మండలం పైడిపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎస్ఐ రణధీర్ తీవ్రగాయాల పాలు కాగా మెరుగైన చికిత్స నిమిత్తంహైదరాబాద్ ఏఐజి ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఎంజీఎం మార్చురీ వద్దకుమృతుల కుటుంబ సభ్యులు, పెద్ద ఎత్తున పోలీసుబలగాలు చేరుకున్నాయి.

# రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులకు చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మే 08 (తీన్మార్ న్యూస్): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం రేగొండ మండలంలోని దమన్నపేట రైతు వేదిక మరియు తిరుమలగిరి గ్రామంలోని జిల్లా, మండల పరిషత్ పాఠశాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి నూతన ఆర్ఓఆర్ రెవెన్యూ చట్టంపై పైలట్ ప్రాజెక్టు కింద రేగొండ మండలాన్ని ఎంపిక చేసి రైతుల నుండి సలహాలు, సూచనలు, భూ సంబంధత సమస్యల దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 11 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉండగా ఇప్పటి వరకు 8 గ్రామాల్లో సదస్సులు పూర్తి అయినట్లు తెలిపారు. హెల్ప్ డెస్క్ ను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు. ప్రజల దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్, రైతులు భూ సంబంధిత సమస్యలపై ఇచ్చిన దరఖాస్తులను తప్పనిసరిగా రిజిస్టర్లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తు స్వీకరించిన సమయంలోనే సంబంధిత రిమార్క్స్ కూడా నమోదు చేయాలని విచారణకు సులువుగా ఉంటుందని సూచించారు. దరఖాస్తుల విచారణ ప్రక్రియను వేగవంతం చేసి, ప్రజలకు త్వరితగతిన న్యాయం చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తు లు ఆధారంగా నోటీసులు జారీ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డిఓ రవి, తహసీల్దార్లు శ్వేతా, సత్యనారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

### ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అతికించుకోవాలి

### ఆత్మకూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన



ఆత్మకూర్ మే 08 తీన్మార్ న్యూస్: - వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలోని స్థానిక తిప్పడంపల్లి గ్రామంలో ఆత్మకూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్ సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాల గురించి అవగాహన కల్పించారు.రోడ్డు ప్రమాదల నివారణకు తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలను సూచనలను సలహాలను తెలియజేశారు. తప్పనిసరిగా ట్రాక్టర్ డ్రైవర్లు తమ ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లను అతికించుకోవాలని సూచించారు.గురువారం రోజు సుమారు 15 ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లను అతికించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూరు పోలీస్ శాఖ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం

### ఇదొక సువర్ణ అవకాశం

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్ జిల్లా, మే 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ (తాలిమ్) నుండి లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు తెలంగాణలోని అన్ని మీ సేవ కేంద్రాలలో లైసెన్స్ సర్వే శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తు చేయవచ్చుని ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాలలో మొత్తం 50 పని దినాలు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

**అభ్యర్థుల అర్హతలు**

ఇంటర్మీడియట్ (గణిత శాస్త్రం ఒక అంశంగా ఉండాలి) కనీసం 60% మార్కులతో
ఐటీఐ డ్రాఫ్ట్స్ మెన్ (సివిల్) డిప్లొమా (సివిల్) బి.టెక్ (సివిల్)
లేదా ఇతర సమానమైన అర్హత

**దరఖాస్తు విధానం**

దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్ను 2025 మే 5 నుండి మే 17 వరకు మీ సేవా కేంద్రాల ద్వారా మాత్రమే రూ. 100/- చెల్లించి పొందవచ్చు.

దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ: 17.05.2025 (మీ సేవ కేంద్రాల్లో మాత్రమే)

**ఫీజు వివరాలు**

OC అభ్యర్థులకు రూ.10,000/- BC అభ్యర్థులకు రూ.5,000/-
SC/ ST అభ్యర్థులకు రూ.2,500/-

లైసెన్స్ కలిగిన సర్వేయర్లుగా మారేందుకు ఇదొక సువర్ణ అవకాశమని అర్హత కలిగినటువంటి అభ్యర్థులు, తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మానేజ్మెంట్ నుండి విడుదల అయినటువంటి ఈ నోటిఫికేషన్ ని సద్వినియోగ పరుచుకోవాలని అట్టి ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు

# శ్రీవాణి హై స్కూల్ విద్యార్థిని అభినందించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



ఆత్మకూర్ మే 08 తీన్మార్ న్యూస్: పదవ తరగతి ఫలితాలలో వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని శ్రీవాణి హై స్కూల్ విద్యార్థి పి పూజ 577/600 మార్కులు సాధించింది ఈ సందర్భంగా గురువారం రోజు వనపర్తి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలో అత్యుత్తమ మార్కులు సాధించిన పి. పూజనుజిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఐఏఎస్ చేతుల మీదుగా విద్యార్థిని సన్మానించి అభినందించారు అనంతరం విద్యార్థికి బహుమతి అందజేశారు. వీరితోపాటు జిల్లా విద్యాశాఖ అధికారి మరియు శ్రీవాణి హై స్కూల్ ఆత్మకూరు ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఆత్మకూర్ మే 08 తీన్మార్ న్యూస్: - మక్తల్ నియోజకవర్గ పరిధిలోని నర్వ మండల కేంద్రం చిట్యాల గ్రామానికి చెందిన మూడుమల్ల పెద్ద గణేష్ వెంకటేష్ లు చిట్యాల వాగు నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారంతో గురువారం రోజు నర్వ సబ్ ఇన్స్పెక్టర్ సి.కురుమయ్య ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించగా చిట్యాల వాగు నుండి అక్రమంగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకనుతరలిస్తున్నారు. కావున వారిపై కేసు నమోదు చేసి అట్టి ఇసుక ట్రాక్టర్లను నర్వ పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగిందని నర్వ సబ్ ఇన్స్పెక్టర్ సి.కురుమయ్య తెలిపారు.



# శివుడికి గుడిలేదని అయ్యగారి ఆవేదన





కాటారం, మే 08 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి కాటారం మండలంలోని పోతలవాయ విలేజ్ లో ఎంతో పురాతనమైన శివలింగానికి ఎలాంటి గుడి లేకపోవడం బాధాకరం ఆ యొక్క గుడికి సురేష్ అయ్యగారు గత పది సంవత్సరాలుగా పూజలు చేస్తూ అర్చన చేస్తున్నారు కాటారం మండలంలో పూతలవాయిలో శివలింగం ఉండటం చాలా గొప్ప విషయం ఎంతో పురాతనమైన ఆ శివలింగానికి గుడిలేదని సురేష్ అయ్యగారు ఎంతోమందికి చెప్పిన పట్టించుకోలేదు ఊర్లో పెద్దలకైనా చెప్పిన కూడా ఎలాంటి ఫలితం లేదు ఎవరైనా దాతలు పెద్దమనిషి చేసుకొని ముందుకు వచ్చి ఈ యొక్క శివలింగానికి గుడి గోపురం కట్టించగలరు అర్చకులు సురేష్ లు కోరారు.

# ఒప్పంద ఉద్యోగాలకు దరఖాస్తుల చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మే 08 (తీన్మార్ న్యూస్): ఒప్పంద ఉద్యోగాలకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు.ప్రపంచ బ్యాంకు సహకారంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ర్యాంప్ పథకానికి ఒప్పంద పద్ధతిలో మేనేజర్, సహాయ మేనేజరు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి. పాటిల్, పరిశ్రమల శాఖ జీఎం తిరుపతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్య ర్థులు ఈ నెల 10వ తేదీలోపు %షష.అఅఎంఎవ.స్త్రశీజ.అఅ% వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఐ డి ఓ సి కార్యాలయంలో ని పరిశ్రమల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

# బైక్ పై వెళ్తున్న వ్యక్తిని ఢీ కొట్టిన ఇసుక లారీ

### అక్కడికక్కడే ఒకరు మృతి



కాటారం, మే 08 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం పోలీస్ స్టేషన్ పరిధిలో 353 జాతీయ రహదారిపై చింతకాని క్రాస్ రోడ్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు కాటారం మండలంలోని ధనవల గ్రామానికి చెందిన తులసగారి రాజలింగం వివాహానికి హాజరై మోటార్ సైకిల్ పై ఇంటికి వెళుతున్న క్రమంలో చింతకరన్ క్రాస్ రోడ్ వద్ద పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన మార్కెట్ల వద్ద వరంగల్ వైపు వెళుతున్న ఇసుక లారీ ఢీకొనడంతో బైక్ పై నుండి రాజలింగం లారీకి ఢీకొని రోడ్డుపై కింద పడి అక్కడికక్కడే మరణించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు డ్రైవర్ పరారీలో ఉ న్నాడు కాటారం సబ్ ఇన్స్పెక్టర్ మేకల అభినవ్ ఘటన స్థలం చేరుకొని వివరాలు తెలుసుకున్నారు ఇసుకరాలిలా రవణాలో ప్రమాదాలు జరుగుతుందో ప్రజలు ఆందోళన చెందుతున్నారు వ్యక్తిని అరెస్ట్ చేయాలని కుటుంబ సభ్యులు గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు

# పహల్గాం పై ప్రతీకార చర్య ఆపరేషన్ సింధూర్

### ఉగ్రవాదులకు దీటైన బుద్ధి చెబుతున్న భారత్



పెద్దమందడి మే 08 (తీన్మార్ న్యూస్) : పహల్గాం లో ఉగ్రవాదుల కిరాతక దాడిలో 28 మంది అమాయక మహిళలు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనపై భారత్ తక్షణమే ప్రతీకారంగా స్పందించింది. బుధవారం అర్ధరాత్రి 1:45 గంటల సమయంలో పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్లోని ఐదు, పాకిస్తాన్ లోని నలుగురు ఉగ్రవాద స్థావరాలను భారత ఆర్మీ కూకటి వేళ్లతో గుర్తించి పేల్చివేసింది. ఈ నేపథ్యంలో పెద్దమందడి మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ జి. సుదర్శన్ రెడ్డి స్పందిస్తూ, "ఉగ్రవాదులు మీ మోదికి చెప్పండి అన్న వ్యాఖ్యకు ఇండియన్ ఆర్మీ మోదీ గారి నాయకత్వంలో గట్టి బుద్ధి చెప్పింది. కానీ ఈ పోరాటం యుద్ధం ఒక్క రోజుకే పరిమితం కావచ్చు లేదా కొన్ని రోజులు కొనసాగవచ్చు. మన దేశంలోని ప్రతి పౌరుడి బాధ్యత దేశ రక్షణలో భాగస్వామిగా ఉండడం అన్నారు. అలాగే, ఉగ్రవాదులు కేవలం సరిహద్దుల్లో కాకుండా మన దేశంలోని కొన్ని నగరాల్లో దాగి ఉంటున్నారు. అలాంటి దుశ్శక్తులను గుర్తించి ప్రజలుగా అప్రమత్తంగా ఉండాలి. ఫేక్ న్యూస్ లను నమ్మకుండా, రాజకీయ విభేదాలను పక్కన పెట్టి, భారత ఆర్మీకి అండగా నిలదాం. ఇది పార్టీకి సంబంధించిన విషయం కాదు, దేశ భద్రతకు సంబంధించిన అంశం. జెండాలు కాకుండా జాతిని ముందుంచే రోజులు ఇవి అని పేర్కొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి U DISE పోర్టల్ నందు నమోదు అవ్వాల్సిందే

**జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మే 08 (తీన్మార్ న్యూస్): ఇంటర్మీడియట్ పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి U DISE నందు కచ్చితంగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. గురువారం ఐడి వోసి కార్యాలయం సమావేశం మందిరం నందు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతంలో బాలికల కంటే బాలురు వెనుకబడి ఉండటానికి గల కారణాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ లో కూడా డిజిటల్ ఎడ్యుకేషన్ మరియు ఫేషియల్ అటెండెన్స్ ప్రవేశ పెట్టేలా చూడాలన్నారు. ఇంటర్మీడియట్ కళాశాలలో అతిపెద్ద మైదానాలు ఉన్నప్పటికీ ఇంకుడు గుంతల నిర్మాణం జరగడం లేదని, వెంటనే అన్ని కళాశాలల్లో ఎకరాకి ఐదు ఇంకుడు గుంతలు లు నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ కళాశాలలో పరీక్షకు హాజరైన సంఖ్యకు, U DISE నందు నమోదు కు చాలా తేడాలు ఉన్నాయని, అట్టి కళాశాల ప్రిన్సిపాల్ లను పిలిపించి జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో అందరూ ఇక్కడే విద్యార్థులందరినీ యుడైస్ ప్లస్ పోర్టల్ లో నమోదు చేసేలా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర చారి మరియు కోఆర్డినేటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సింధూర్ సాహసోపేతం

**టి.సాయిచరణ్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వనపర్తి జిల్లా**



వనపర్తి, మే 08 (తీన్మార్ న్యూస్): పాకిస్తాన్ అక్రమిత కాశ్మీర్లో, ఉగ్రవాద శిబిరాలపై భారత త్రివిధ దళాలు నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ సాహసోపేత చర్యగా నిలిచిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి.సాయి చరణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీ.సాయికిరణ్ రెడ్డి మాట్లాడుతూ పహాల్గంలో పర్యాటకుల మీద దాడి చేసి 26 మంది మరణానికి కారణమైన ఉగ్రవాదులకు సంబంధించి పాక్ అక్రమిత కాశ్మీరులోని శిబిరాల పైన, భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ దేశానికె గర్వకారణం అని అన్నారు. సీమాంతర ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో పెకిలించాలని, భారత్ చేపట్టిన ఆపరేషన్స్ సింధూర్ దేశానికే గర్వకారణం అని సంతోషం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ నుంచి పెంచి పోషిస్తున్న ఉగ్రవాదాన్ని, రూపు మాపే విధంగా, లస్కర్ ఏ తోయిబా ప్రధాన కార్యాలయాలను లక్ష్యంగా చేసుకొని భారత సైనికులు చేపట్టిన ఆపరేషన్ సింధూర్ ను ఆయన సంపూర్ణంగా అభినందించారు. భారత బలగాల సైన్యాన్ని అభినందించారు. ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన సైనికులకు సెల్యూట్ చేస్తున్న అని గర్వంగా చెప్పారు. ముష్కరుల చర్యలకు ఇది తగిన గుణపాఠం అని ఇంతటితో ఆగిపోకుండా భారత్, మరెన్నో ఆపరేషన్, పాకిస్తాన్ ఉగ్రవాదులపై నిర్వహించి ఉగ్రవాద ప్రేరేపిత పాకిస్తాన్ కు గుణపాఠం నేర్పించాలని అన్నారు. పాక్ అక్రమిత కాశ్మీర్ లోని శిబిరాల పైన భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళం, సమన్వయంతో ఖచ్చితమైన దాడులు చేసి, ఉగ్రవాద సంస్థ జైస్ ఏ మొహమ్మద్ ప్రధాన కార్యాలయాన్ని వారి శిబిరాలను ధ్వంసం చేశాయన్నారు. దేశ ప్రజలు ఇంకా ప్రపంచంలోని అనేక మెజార్టీ దేశాలు భారత్ నిర్ణయం వెంట మద్దతుగా నిలిచాయని, ఆపరేషన్ సింధూర్ పరిపూర్ణంగా విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యుద్ధం అనివార్యమైనప్పుడు కచ్చితంగా భారత్ యుద్ధ నీతితోనే పాకిస్తాన్ దేశానికి సమాధానం చెప్తుందని అన్నారు. దేశ రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యలకు పార్టీల కతీతంగా ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వవలసిన అవసరం ఉందని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి.సాయి చరణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆపరేషన్ సిందూర్ ఆరంభం మాత్రమే

**ఇది కొనసాగుతుందని ప్రకటించిన కేంద్రం**

**అఖిలపక్ష భేటీలో వివరాలు వెల్లడించిన రాజ్‌నాథ్**

**దేశ రక్షణలో రాజీపడబోమని వెల్లడి**

**న్యూఢిల్లీ, మే 8:** ఆపరేషన్ సిందూర్‌లో వంద మందికి పైగా ఉగ్రవాదులు మరణించారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. గురువారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆపరేషన్ సిందూర్ విజయం, పర్యవసానాలను ఆయన వివరించారు. సిందూర్ అనేది కొనసాగుతున్న ఆపరేషన్ అని అన్నారు. భారత్ మరిన్ని దాడులు చేయాల్సిన అవసరం లేదని, కానీ పాక్ దళాలు దాడిచేస్తే తిరిగి ఎదురు దాడి చేస్తామని అన్నారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, ఎస్.జయశంకర్, జె.పి.నడ్డా, నిర్మలా సీతారామన్ ప్రభుత్వం తరపున హాజరవగా, కాంగ్రెస్ నుండి రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, టిఎంసి నుండి సందీప్ బందోపాధ్యాయ, డిఎంకె నుండి టి.ఆర్.బాలులు సమావేశానికి హాజరయ్యారు. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో భారత్‌లోని సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టేందుకు పాక్ యత్నించగా.. వీటిని భారత దళాలు దీటుగా తిప్పికొట్టాయి. ఈ క్రమంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ సహనాన్ని అలుసుగా తీసుకుంటే ఆపరేషన్ సిందూర్ తరహా చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. దేశభద్రతకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టంచే శారు. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకున్ననిర్ణయాన్ని అఖిలక్షం సమర్థించింది. సైన్యానికి బాసటగా ఉంటామని రాహుల్ తదితరులు ప్రకటించారు. ఈ క్రమంలో పాకిస్థాన్‌లో, పాకిస్థాన్ ఆక్రమిత జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అప్పుడే ముగిసిపోలేదని కేంద్రం ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ ముగిసిపోలేదని, ఇంకా కొనసాగుతోందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.

# పక్కాగా కేంద్రాల నిర్వహణ

**కొనుగోలు ప్రక్రియ వేగవంతం**

**అకాల వర్షాల నేపథ్యంలో అప్రమత్తం గా ఉండాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ జిల్లా, మే 08 (తీన్మార్ న్యూస్): జనగామ మండలం పెద్దపహాడ్, గోపరాజు పల్లి లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

తేమ శతం వచ్చిన ధాన్యన్ని ఆలస్యం కాకుండా వెనువెంటనే తూకం వేయించి ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలన్నారు. కేంద్రాలలో ప్రభుత్వ నాంస్ ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, అన్ని కొనుగోలు కేంద్రాలలో గన్ని సంచులు, అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలు, రైతుల ఖాతా వివరాలను ఎలాంటి ఆలస్యం కాకుండ ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అన్ని కేంద్రాలలో టార్పాలిన్స్ , అందుబాటులో ఉంచుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని సూచించారు, రవాణా చేయు సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు, డిమాండ్ కు అనుకూలంగా లారీలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మార్కెటింగ్, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు

# బాల్య వివాహాలపై, బాలల రక్షణ, చట్టాలపై అవగాహన కార్యక్రమం



వరంగల్ జిల్లా, మే 08 (తీన్మార్ న్యూస్): గీసుగొండ మండలం హోర్జా తండా గ్రామం మరియు ప్రగతి మండల సమైక్య గీసుగొండ మీటింగ్ లో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సఖి సెంటర్ 181 మరియు జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారు పాల్గొని అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా చైల్డ్ హెల్ప్ లైన్ నుండి కేస్ వర్కర్ సుష్మ డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ నుండి శ్వేత ఔట్ రీచ్ వర్కర్,సఖి సెంటర్ కేస్ వర్కర్ తిరుమల, మాట్లాడడం జరిగింది. చైల్డ్ హెల్ప్ లైన్ నుండి సుష్మ మాట్లాడుతూ 1098 సర్వీసెస్ 24/7 సర్వీస్ అందిస్తుంది అని చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ గురించి మరియు బాల్య వివాహాలు బాల కార్మికులు పోక్స్ యాక్ట్ చైల్డ్ లేబర్ యాక్ట్ తప్పిపోయిన పిల్లలు మానవ అక్రమ రవాణా ప్రేమ వివాహాలు తల్లి తండ్రి వదిలిసిన పిల్లలు బిక్షాటన చేస్తున్న పిల్లలు, పిల్లల్ని రెస్క్యూ చేసే వారికీ ఎడ్యుకేషన్ అండ్ షెల్టర్ అందిస్తాం అని అవగాహనా ఇవ్వడం జరిగింది,శ్వేత గారు స్పాన్సర్ షిప్ అండ్ వీసీపీసీ ఫార్మషన్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మరియు డీసీపి యు సర్వీసెస్ గురించి మాట్లాడారు. మహిళల శిశు, దివ్యాంగుల, మరియు వయోవృద్ధులశాఖ అధ్వర్యంలో పైన తెలిపిన విభాగాలు పనిచేస్తాయని, మహిళలకు మరియు పిల్లలకు, వృద్ధులకు అందించే సేవలు వివరిస్తూ మహిళల, బాలికల రక్షణ మరియు భద్రత కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సఖి సెంటర్లను నడిపిస్తున్నాయని సఖి సెంటర్ కేస్ వర్కర్ తిరుమల మహిళలకు మహిళ హెల్ప్ లైన్ 181 తద్వారా బాధిత మహిళలకు పిల్లలకు కౌన్సిలింగ్ పోలీస్, సహాయము, న్యాయ సహాయము, వైద్య సహాయము, తాత్కాలిక వసతి వంటి సేవలను ఉచితంగా 24 గంటలు అందుబాటులో ఉంటూ అందిస్తామని మరియు అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేని మహిళలు మహిళ హెల్ప్ లైన్ 181 కీ మరియు పిల్లలు 1098 కీ కాల్ చేసినట్లయితే రెస్క్యూ చేయడం జరుగుతుందని చెప్పడం జరిగింది. అలాగే వృద్ధులకి సమస్య ఉన్నట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 14567 కి కాల్ చేయాలని తెలిపారు. ఇలాంటివి ఏమైనా గ్రామాల్లో వారి పరిధిలో పనిచేస్తున్న క్రమంలో ఎవరైనా మహిళలు,పిల్లలు ఇబ్బందులకు గురైనట్లయితే మా దృష్టికి తీసుకురావాల్సిందిగా మండల సమైక్య మీటింగ్ సభ్యులకు తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కేసు వర్కర్ సుష్మ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ నుండి ఔర్ రీచ్ వర్కర్ శ్వేత సఖి సెంటర్ కేసు వర్కర్ తిరుమల సెక్రటరీ శారదా మరియు APM సురేష్ కుమార్ గీతాంజలి CC అశోక్ ట్రైనర్ మౌనిక పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



హనుమకొండ జిల్లా, మే 08 (తీన్మార్ న్యూస్): రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన వరి ధాన్యాన్ని సకాలంలో తూకం జరిపించి, నిర్ణీత రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య నిర్వాహకులకు సూచించారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. నడికుడ మండలంలోని చర్లపల్లి లలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వలు, రైస్ మిల్లులకు పంపించిన ధాన్యం నిల్వల గురించి, రైతుల ఖాతాలలోకి జమ చేసిన బిల్లుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అకాల వర్షాలు కురిసే ఆస్కారం ఉన్నందున ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, ధాన్యం తడిసిపోకుండా రైతులకు టార్పాలిన్స్ అందజేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి వసతులు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని, ముఖ్యంగా లారీల కొరత, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని అన్నారు. గన్నీ బ్యాగులు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, తేమ శాతం కొలిచే మీటర్లు, గ్రెయిన్ క్యాలిపర్లు సరిపడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏ దశలోనూ రైతులు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ నారాయణ, తహసీల్దార్ నాగరాజు, ఎపిఎం రమాదేవి, ఎఇఓ నాగరాజు ఉన్నారు.

# భూ సమస్యల సత్వర పరిష్కారానికై రెవెన్యూ సదస్సులు



**జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**

హనుమకొండ జిల్లా, మే 08 (తీన్మార్ న్యూస్): భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. భూ భారతీ రెవెన్యూ సదస్సులో భాగంగా గురువారం నడికూడ మండల కేంద్రంలో, నడి కూడ మండలం చర్లపల్లి గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్ డెస్క్ తదితర వాటిని సందర్శించి, రైతుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. సదస్సులతో భేటీ అయ్యి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా భూభారతి విధివిధానాల గురించి, చట్టంలో పొందుపర్చిన అంశాలపై అవగాహన కల్పించారు. రెవెన్యూ అధికారులతో కూడిన బృందాలు అందుబాటులో ఉంటూ భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన మీదట నిర్ణీత గడువులోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ సూచించారు. రైతులు, ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులలో పరకాల ఆర్డీఓ నారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మంగీలాల్, గృహ నిర్మాణ శాఖ అధికారి రవీందర్, తహసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో విమల, మండల వెరిఫికేషన్ అధికారి హారిక, ఇతర అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# హెలికాప్టర్ కూలి ఆరుగురు పర్యాటకుల మృతి

**డెహ్రాడూన్, మే 8:** ఉత్తరాఖండ్ లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పర్యాటకులతో వెళ్తున్న ఓ హెలికాప్టర్ కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురు పర్యాటకులు మృతి చెందారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరకాశీలో గంగోత్రి వైపు వెళ్తున్న ఒక ప్రైవేటు హెలికాప్టర్ గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో కూలిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద సమయంలో హెలీకాప్టర్‌లో ఏడుగురు ప్రయాణికులు ఉన్నారు. వారిలో ఆరుగురు మృతి చెందగా.. ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు, సహాయక సిబ్బంది ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు.

# మణిగిల్ల క్రీడాకారుల విజయం

**పెద్దమందడి ఏస్.ఐ శివకుమార్ చేతుల మీదుగా**

**బహుమతుల ప్రదానం. రన్నర్‌గా పెద్దమందడి జట్టు**



పెద్దమందడి మే08 (తీన్మార్ న్యూస్) : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో గ్రామ దేవత పెద్దమ్మ పండుగ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. మొత్తం 30 క్రికెట్ జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. గత వారం రోజులుగా ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల ఫైనల్ మ్యాచ్‌లో మణిగిల్ల మరియు పెద్దమందడి క్రికెట్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో మణిగిల్ల క్రీడాకారులు విజయం సాధించి విజేతగా నిలవగా, పెద్దమందడి జట్టు రెండవ స్థానాన్ని సాధించింది. గెలుపొందిన క్రీడాకారులకు పెద్దమందడి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ శివకుమార్, గ్రామ మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయనీ, విద్యతో పాటు క్రీడల్లో కూడా యువత ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయివరకు ఎదగాలని సూచించారు. కార్యక్రమానికి లెక్చరర్ జ్ఞానేశ్వర్, మణిగిల్ల గ్రామ ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# మెడికల్ కాలేజీ ద్వారా ఉచిత వైద్యం

- వైద్య సేవల కోసం భారీగా నిధుల వెచ్చింపు
- ఖమ్మంలో మెడికల్ కాలేజీకి శంకుస్థాపన
- పాల్గొన్న నలుగురు మంత్రులు



**ఖమ్మం, మే 8:** ప్రభుత్వ మెడికల్ కళాశాల ద్వారా పేదలకు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుతాయని,ఖమ్మం మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయటం చాలా సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఈ ప్రభుత్వం దొరల కోసమో పాలకుల కోసమో పని చేసే ప్రభుత్వం కాదని అన్నారు. 9065 సీట్లలో వైద్య విద్యను అందజేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించామని అన్నారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 5,950 కోట్లు-ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలో రూ. 11,482 కోట్లు ఖర్చు చేసిందన్నారు. వరంగల్‌లో సభ పెట్టి అడ్డగోలు మాటలు మాట్లాడిన వారికి ఈ లెక్కలు తెలియాలని చెబుతున్నానని అన్నారు. 90 లక్షల కుటుంబాలకు రూ. 10 లక్షల వరకూ లబ్ధి చేకూర్చి వైద్యం అందించామని తెలిపారు. గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే రాజీవ్ ఆరోగ్య శ్రీ పెండింగ్ బిల్లులు అన్నీ క్లియర్ చేస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిన వైద్య రంగాన్ని గాడిన పెడుతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి గురువారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యా వైద్య రంగాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ప్రపంచంతో పోటీపడేలా విద్యా వైద్య రంగాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ భవన సముదాయ నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రజల పక్షాన మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నాగపూర్, అమరావతి నేషనల్ హైవే పక్కన మెడికల్ కాలేజ్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఖమ్మంలో రూ. 130 కోట్లతో అద్భుతమైన మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైై విద్య, వైద్య ఆరోగ్యశాఖ శాఖలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. గత ప్రభుత్వం మొండి గోడలతో వదిలి వెయ్యి కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టిన అన్నిటినీ క్లియర్ చేస్తున్నామన్నారు. విద్య వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేస్తుందన్నారు. అన్ని రకాల మౌలిక వసతులతో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయబోతు న్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మా అందరికీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదర్శమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రూ. 130 కోట్లతో ఖమ్మంలో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని, గోదావరి పరివాహక ప్రాంతంలో ఆరోగ్యశాఖ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు-చేస్తున్నామన్నారు. 16 నెలల పాలనలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ-వైద్య సేవలు అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. తర్వలోనే ఖమ్మంకు ఆర్గాన్ రిట్రీ-వర్ సెంటర్ ఏర్పాటు-చేస్తున్నామని, వరంగల్‌లో రూ. 39 కోట్లతో రీజీనల్ క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే ఖమ్మంలో వ్యాస్కులర్ యాక్సెస్ సెంటర్‌ను ఏర్పాటు-చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాలకు అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కోరిక మేరకు నర్సింగ్ కళాశాల ఏర్పాటు- చేస్తున్నామని దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మిడ్ వైఫరీ కోర్సులు విద్యార్థులకు అందుబాటు-లో ఉంచబోతున్నామని, పేద వారికి వైద్యం అందుబాటు-లో ఉండాలని మంత్రి దామోదర అభిప్రాయం వ్యక్తం చేశారు.

# పాక్ డ్రోన్ దాడులను తిప్పికొట్టిన రక్షణశాఖ

- లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం
- పాక్ రక్షణ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని దాడులు
- భారత్‌లో పలు ప్రాంతాల్లో పాక్ డ్రోన్ దాడులు
- ఆయా ప్రాంతాల్లో డ్రోన్ శకలాల సేకరణలో అధికారులు



**న్యూఢిల్లీ, మే 8:** భారత్ ప్రతీకార దాడులతో బెంబేలెత్తుతున్న పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో దాడులకు యత్నించిన దాయాదికి చుక్కెదురైంది. ఈ క్రమంలోనే పాకిస్థాన్‌లోని ఆయా ప్రాంతాల్లో మోహరించిన గగనతల రక్షణ వ్యవస్థలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. దీంతో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైనట్లు-భారత రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. చైనాకు చెందిన హెచ్‌క్యూ-9 రక్షణ వ్యవస్థలను ఉపయోగిస్తున్న పాకిస్థాన్.. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణి దాడులకు యత్నించింది. అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తలా, జలంధర్, అదాంపుర్, భఠిండా, చండీగఢ్, నాల్, ఫలోడి, భుజ్ తదితర ప్రాంతాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకునేందుకు యత్నించింది. అయితే.. వీటిని ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ గ్రిడ్, గగనతల రక్షణ వ్యవస్థలతో సమర్థంగా అడ్డుకున్నట్లు రక్షణశాఖ వెల్లడించింది. పాకిస్థాన్ దాడులకు రుజువుగా వీటి శకలాలను ఆయా ప్రాంతాల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపింది. ఈ క్రమంలోనే భారత్ ప్రతీకార దాడులకు దిగింది. పాకిస్థాన్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న గగనతల రక్షణ రాడార్‌లు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని సైన్యం విరుచుకుపడింది. లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం అయినట్లు- విశ్వసనీయంగా తెలిసింది. మరోవైపు నియంత్రణ రేఖ వెంట కాల్పుల విరమణ ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ దాడులను ముమ్మరం చేసింది. జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరీ, మెంధార్, పూంచ్, ఉరి, బారాముల్లా, కుప్వారా ప్రాంతాల్లో మోర్టార్లు, భారీ ఫిరంగులతో దాడులుచేస్తోంది. వీటిలో ఇప్పటివరకు 16 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఇదిలావుంటే కరాచీ, లాహోర్, సహా ఇతర ప్రధాన నగరాలపై దాడి చేయడానికి భారతదేశం డ్రోన్‌లను ఉపయోగించిందని పాకిస్తాన్ పేర్కొంది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారత సాయుధ దళాలు క్షిపణి దాడులు చేసిన ఒక రోజు తర్వాత, లాహోర్, కరాచీలపై భారతదేశం డ్రోన్ దాడులు ప్రారంభించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. ఇలా ఉండగా, భారత్ ఆపరేషన్ సిందూర్ కొనసాగిస్తోంది. పాక్ కు చుక్కలు చూపిస్తోంది. పాక్ దాడులను తిప్పికొడుతూ భారత్ భారీగా ఎదురుదాడులు చేస్తోంది. తాజాగా పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్‌పై భారత్ డ్రోన్ దాడి చేసింది. పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ధ్వంసం చేసింది. అటు-, రావల్పిండి హెడ్ క్వార్టర్ పైనా భారత్ డ్రోన్ దాడి చేసింది. దీంతో పాకిస్థాన్ మీడియా ముందుకొచ్చి ప్రపంచ దేశాలతో లబోదిబోమంటూ మొరపెట్టుకుంటోంది. లాహోర్, కరాచీ ఇంకా పాకిస్థాన్ లోని ఇతర ప్రదేశాలలో భారత్ వరుస డ్రోన్ దాడులు నిర్వహించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. మరోవైపు, కరాచీ విమానాశ్రయాన్ని సాయంత్రం 6 గంటల వరకు మూసివేసినట్లు- పాకిస్థాన్ ప్రకటించింది.



# జమ్మూ లక్ష్యంగా పాక్ దాడులు

**న్యూఢిల్లీ, మే 8 :** భారత్- పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. తాజాగా జమ్మూ లక్ష్యంగా పాకిస్థాన్ డ్రోన్లతో దాడులకు యత్నిస్తున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. జమ్మూలోని ఓ ఎయిర్ స్ట్రిప్‌ను పాక్ లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సాంబా జిల్లాలో పాక్ రేంజర్లు భారీఎత్తున కాల్పులకు తెగబడుతున్నట్లు సమాచారం. పలుచోట్ల భారీగా సైరన్ శబ్దాలు వినిపిస్తున్నాయి. కిష్త్వార్, అఖ్నూర్ సహా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ప్రజలంతా ఇళ్లలోనే ఉండాలని సైన్యం హెచ్చరికలు జారీచేసింది.



# దేవుడా మా దేశాన్ని కాపాడు

## పాక్ ఎంపి వేడుకోలు వీడియో వైరల్


**న్యూఢిల్లీ, మే 8:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టిన భారత్.. పాక్‌లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ పరిణామాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న దాయాది దేశం.. భారత్‌పై దాడులకు విఫలయత్నం చేస్తోంది. పాక్ దాడులను భారత బలగాలు సమర్థంగా తిప్పికొడుతున్నాయి. గగనతల రక్షణ వ్యవస్థలనూ ధ్వంసం చేశాయి. ఈ పరిణామాల నడుమ పాక్ పార్లమెంటులో ఓ సభ్యుడు చేసిన వ్యాఖ్యల వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. తమ దేశాన్ని కాపాడాలంటూ దేవుడిని వేడుకుంటున్నట్లు అందులో కనిపిస్తోంది. మన దేశం బలహీనంగా ఉంది. అందుకే ఈ దేశాన్ని కాపాడాలంటూ మనమంతా ఆ దేవుడిని ప్రార్థిద్దాం అంటూ ఎంపీ, విశ్రాంత సైనికాధికారి మేజర్ తాహిర్ ఇక్బాల్ పార్లమెంటు వేదికగా విజ్ఞప్తి చేశారు. మేం నిస్సహాయ స్థితిలో ఉన్నాం. నీ దయ ఉంటే మేం విజయం సాధిస్తాం. ఈ దేశాన్ని రక్షించు. శత్రువును ఓడించే బలాన్ని ఇవ్వు అంటూ ప్రార్థించారు. ఈ వీడియో కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. భారత్ నుంచి వరుస పరాభవాలు ఎదు-రవుతున్న వేళ పాకిస్థాన్‌లో నెలకొన్న తాజా పరిస్థితులను ఈ వీడియో చాటుతోందని పలువురు నెటిజన్లు పేర్కొన్నారు.

# పౌరులకు జాతీయ జెండాతో అంత్యక్రియలు చేస్తారా?

## శవపేటికలపై పాక్ జెండాలు కప్పడంలో అర్థం ఏమిటో

## పాక్ దేనికి సరైన సమాధానం ఇవ్వలేక పోయింది

## విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడి



**న్యూఢిల్లీ, మే 8:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ చేపట్టిన సైనిక దాడుల్లో కేవలం ఉగ్రవాదులను మాత్రమే హతమార్చినట్లు- విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. పౌరులు చనిపోయారన్న పాకిస్థాన్ ఆరోపణలను ఆయన ఖండించారు. భారత సైనిక దాడుల్లో మరణించిన ముగ్గురు ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాకిస్థాన్ ఆర్మీ అధికారులు హాజరైన చిత్రాన్ని విక్రమ్ మిస్రీ ప్రదర్శించారు. శవపేటికలపై పాకిస్థాన్ జెండాలు కప్పి ప్రభుత్వ లాంఛనాలతో పౌరులకు అంత్యక్రియలు నిర్వహిస్తారా అని ప్రశ్నించారు. మే 7న భారత్ జరిపిన సైనిక దాడులన్నీ జాగ్రత్తగా ఎంచుకున్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, ఉగ్రవాద లక్ష్యాలపైనే అని విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు. 'ఈ దాడుల్లో ఎవరైనా పౌరులు చనిపోతే, ఈ చిత్రం మీ అందరికీ ఎలాంటి సందేశాన్ని పంపుతుందో నాకు ఆశ్చర్యంగా ఉంది. ఇది అడగాల్సిన ప్రశ్న. పౌరుల అంత్యక్రియల్లో శవపేటికలపై పాకిస్థాన్ జెండాలు కప్పి, ప్రభుత్వ గౌరవం ఇవ్వడం కూడా వింతగా ఉంది. హతమైన వ్యక్తులు ఉగ్రవాదులే. అలాంటి ఉగ్రవాదులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు బహుశా పాకిస్థాన్‌లో ఒక ఆచారం కావచ్చు. ఇది మాకు పెద్దగా అర్థం కాలేదు' అని అన్నారు. అలాగే మతపరమైన ప్రదేశాలపై భారత్ దాడి చేసిందన్న పాకిస్థాన్ ఆరోపణలను కూడా విక్రమ్ మిస్రి ఖండించారు. ఇది పూర్తిగా అబద్ధమని అన్నారు. కేవలం ఉగ్రస్థావరాలు లక్ష్యంగా దాడులు సాగాయని అన్నారు. ఇకపోతే పాక్ దాడులను సమర్థంగా తిప్పికొట్టామన్నారు. ఈ పాక్ సైన్యం కాల్పుల్లో 16 మంది మృతి చెందినట్లు తెలిపారు. పహల్గామ్ దాడులకు పాల్పడింది తామేనని ఆర్‌టిఎ ప్రకటించిందని, అది లష్కరే తోయిబాకు అనుబంధ సంస్థ అని తెలిపారు. అయితే, అంతర్జాతీయ సమాజానికి పాక్ తప్పుడు సమాచారం ఇస్తోందన్నారు. ఉగ్రవాదులతో తమక సంబంధాలు లేవని పాక్ బుకాయిస్తోందన్నారు. పాక్‌లో టెర్రరిస్టులు లేరని ఆ దేశ మంత్రి నిస్సిగ్గుగా చెబుతున్నారని.. అనేక దాడుల్లో పాక్ ప్రమేయం ఉందని చాలా సార్లు రుజువైందని వివరించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నదే పాకిస్తాన్ అన్నారు. ముంబై సహా భారత్ లో జరిగిన పలు దాడులపై పాక్ హస్తం ఉందన్నారు. ఉగ్రవాదుల డిఎన్ఎ రికార్డులు, వారి అడ్రస్సులు పాక్‌కు అందించామని.. కానీ పాకిస్తాన్ ఏ అంశంలోనూ స్పందించేదని పేర్కొన్నారు. పాక్ ఏ తీవ్రతతో దాడి చేసిందో అదే తీవ్రతతో ప్రతిదాడి చేశామన్నారు. ఉగ్రసంస్థ గురించి ఐరాసకు పూర్తి సమాచారం ఇచ్చామని తెలిపారు. పాక్ పౌరులు తమ టార్గెట్ కాదని కేవలం ఉగ్రస్థావరాలు మాత్రమే టార్గెట్ చేశామని విక్రమ్ మిస్రీ వివరించారు.

# గుజరాత్ ఖావ్డా వద్ద డ్రోన్ పేలుడు

## అప్రమత్తం అయిన భద్రతా బలగాలు

అహ్మదాబాద్, మే 8: ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత ఆర్మీ విరుకుచుపడింది. ఈ దాడులతో ప్రస్తుతం భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో గుజరాత్‌లోని కచ్ జిల్లాలోని ఇండియా-పాకిస్తాన్ సరిహద్దు సమీపంలో అనుమానాస్పద పేలుడు సంభవించింది. దీంతో భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఖావ్డా ఇండియా బ్రిడ్జి సరిహద్దు ప్రాంతంలో గురువారం ఉదయం డ్రోన్ పేలుడు సంభవించింది. సమాచారం అందుకున్న పోలీసులు, వైమానిక దళ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. అయితే డ్రోన్ సరిహద్దు అవతల నుంచి వచ్చిందా లేదా అనేది ఇంకా నిర్ధారించలేదు. అయితే అనుమానాస్పద డ్రోన్ హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను ఢీకొట్టడంతో పేలుడు సంభవించినట్లు-తెలుస్తోంది. డ్రోన్ పేలుడుకు, పాకిస్తాన్‌కు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. భారత్ దాడులను జీర్ణించుకోలేని పాకిస్తాన్.. నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు జరుపుతోంది. గురువారం కూడా కాల్పులను కొనసాగించింది. అయితే భారత ఆర్మీకి వారికి దీటుగా సమాధానం ఇస్తోంది. పాకిస్తాన్ తిరిగి దాడులు చేయనుందనే సమాచరంతో భారత్ అప్రమైంది. సరిహద్దు రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లో ఇప్పటికే హై అలర్ట్ ప్రకటించింది. పోలీసు సిబ్బందికి సెలవులు రద్దు చేయడంతో పాటూ సెలవులో ఉన్న అధికారులను వెంటనే విధుల్లో హాజరు కావాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే సరిహద్దు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.





# వెలగని ఫ్లడ్ లైట్స్..

## ఢిల్లీ, పంజాబ్ మ్యాచ్ రద్దు..!



ప్లే ఆఫ్స్ బెర్తులు ఖరారు చేసుకోవాలనుకున్న పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌కు పెద్ద షాక్. సాంకేతిక కారణాల వల్ల ధర్మశాలలో వేదికగా జరుగుతున్న మ్యాచ్ రద్దయ్యింది. పంజాబ్ ఇన్నింగ్స్ మధ్యలో ఫ్లడ్ లైట్ వెలగకపోవడంతో.. సాంకేతిక కారణాలతో మ్యాచ్‌ను ఆపేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. ఇరుజట్లకు చెరొక పాయింట్ కేటాయించనున్నారు. వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్ చివరకు ఫలితం తేలకుండానే రద్దయ్యింది. పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్ 10.1 ఓవర్ వద్ద ఫ్లడ్ లైట్ హఠాత్తుగా ఆగిపోయింది. దాన్ని సరిచేసేందుకు సిబ్బంది ప్రయత్నించారు. కానీ, అది వెలగకపోవడంతో ఆటగాళ్ల భద్రతను దృష్టిలో పెట్టుకొని బీసీసీఐ 21:57 గంటలకు మ్యాచ్‌ను రద్దు చేయాలని నిర్ణయించింది.

**దంచేసిన ప్రియాన్ష్..**

టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ బ్యాటింగ్ ఎంచుకోగా 830 గంటలకు టొలి బంతి పడింది. మిచెల్ స్టార్క్ వేసిన తొలి ఓవర్లోనే వరుసగా రెండు ఫోర్లతో ప్రియాన్ష్ ఆర్య(70) తన ఉద్దేశాన్ని చాటాడు. అనంతరం ప్రభ్‌సిమ్రన్ సింగ్(50 నాటౌట్) స్టార్క్‌ను టార్గెట్ చేస్తూ మూడ ఫోర్లు బాది 12 పరుగులు పిండుకున్నాడు. అనంతరం .. చమీర బౌలింగ్‌లో ప్రియాన్ష్ సిక్సర్‌తో పంజాబ్ స్కోర్ 4 ఓవర్లకే 50కి చేరింది. ఆ తర్వాత అక్షర్ పటేల్ బౌలింగ్‌లోనూ సిమ్రన్ 4, ప్రియాన్ష్ 6 కొట్టగా 15 రన్స్ వచ్చాయి. వీళ్లిద్దరి మెరుపులతో పంజాబ్ 6 ఓవర్లకు వికెట్ కోల్పోకుండా 69 పరుగులు చేసింది. తొలి ఓవర్ నుంచి ఢిల్లీ బౌలర్లను ఉతికేస్తున్న ప్రియాన్ష్ 25 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. అక్షర్ పటేల్ బౌలింగ్‌లో సిక్సర్ బాదిన ప్రియాన్ష్ ఆ తర్వాత సింగిల్ తీసి యాభైకి చేరువ-య్యాడీ చిచ్చరపిడుగు. ఆ తర్వాత సిమ్రన్ సైతం 28 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. దంచి కొడుతున్న ఈ జోడీని నటరాజన్ విడదీశాడు. 10 వ ఓవర్ తొలి బంతికి ప్రియన్ష్‌ను ఔట్ చేసిన నటరాజన్ 122 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. దాంతో, ఢిల్లీ జట్టు ఊపిరిపీల్చుకుంది. శ్రేయాస్ అయ్యర్ క్రీజులోకి వచ్చిన కాసేపటికే ఒక ఫ్లడ్ లైట్ పని చేయలేదు. కాసేపటికే మరో రెండు ఆగిపోయాడు. దాంతో, అప్రమత్తమైన అధికారులు కరెంటు పునరుద్ధరణకు ప్రయత్నించారు. కానీ లాభం లేకపోవడంతో మ్యాచ్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.



# రోహిత్ వారసుడు ఫిక్స్

టీమిండియా టెస్ట్ టీమ్‌కు కొత్త కెప్టెన్ ఎవరు అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ అనూహ్యంగా రిటైర్మెంట్ తీసుకోవడంతో అతడి వారసుడు ఎవరనే దాని గురించి జోరుగా డిస్కషన్స్ నడుస్తున్నాయి. ప్లేయర్లతో పాటు క్రికెట్ లవర్స్ అంతా ఐపీఎల్ హడావుడిలో ఉండగా హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు అతడు ప్రకటించాడు. త్వరలో వరల్డ్ టెస్ట్ సిరీస్ న్యూ సైకిల్ మొదలు కానున్న నేపథ్యంలో క్యాష్ రిచ్ లీగ్ మధ్యలోనే హిట్‌మ్యాన్ రిటైర్మెంట్ అనౌన్స్‌మెంట్ చేశాడు. దీంతో భారత టెస్ట్ టీమ్‌కు కొత్త సారథి ఎవరనే డిస్కషన్స్ ఊపందు కుంటున్నాయి. కెప్టెన్సీ రేసులో శుబ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్ లాంటి కుర్రాళ్లతో పాటు సీనియర్ స్పీడ్‌స్టర్ జస్‌ప్రీత్ బుమ్రా, స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే బీసీసీఐ మాత్రం సరైనోడ్ని ఎంపిక చేసిందని తెలుస్తోంది. అతడు ఎవరనేది ఇప్పుడు చూద్దాం..

**అనౌన్స్‌మెంట్ అప్పుడే..**


రోహిత్ శర్మ రిటైర్మెంట్ తీసుకోవడంతో అతడి స్థానంలో కొత్త సారథిని దాదాపుగా ఫిక్స్ చేశారట. హిట్‌మ్యాన్ వారసుడిగా 25 ఏళ్ల గిల్‌ను ఖాయం చేశారని.. త్వరలో అతడికి పగ్గాలు అప్పగించడం పక్కా అని క్రికెట్ వర్గాల్లో వినిపిస్తోంది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్టర్లంతా గిల్ వైపే మొగ్గు చూపారని.. దీనిపై త్వరలో బీసీసీఐతో డిస్కస్ చేస్తారని రూమర్స్ వస్తున్నాయి. బోర్డు పెద్దలు కూడా గిల్‌కు సారథ్య బాధ్యతలు ఇవ్వాలని భావిస్తున్నారట. సెలెక్టర్లతో మీటింగ్ తర్వాత అతడి పేరును అధికారికంగా ప్రకటిస్తారని సమాచారం.

**నో చెబితే..**

పంత్ రూపంలో బలమైన ప్రత్యామ్నాయం ఉన్నప్పటికీ గిల్ వైపే సెలెక్టర్లు, బీసీసీఐ మొగ్గు చూపుతున్నాయని తెలుస్తోంది. బుమ్రాకు కెప్టెన్సీ అనుభవం ఉన్నా గాయాల బెడద వల్ల అతడ్ని పరిగణనలోకి తీసుకోవడం లేదట. రోహిత్ వన్డేల నుంచి తప్పుకున్నాక అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీ పగ్గాలను గిల్‌కే అప్పగించాలనేది బోర్డు ప్లాన్ అని సమాచారం. ఈ మేరకు భారత జట్టు ఆటగాళ్లతోనూ చర్చలు జరిపి.. వాళ్ల రివ్యూస్ తీసుకోవాలని భావిస్తున్నారట. ఎవరైనా సీరియర్లు నో చెబితే.. వాళ్లను ఒప్పించి గిల్‌ను లీడర్‌గా ప్రమోట్ చేయాలని అనుకుంటున్నారని నెట్టింట వినిపిస్తోంది. ఇంగ్లండ్‌తో 5 టెస్టుల సిరీసే సారథిగా శుబ్‌మన్‌కు ఫస్ట్ అసైన్‌మెంట్ కానుందని తెలుస్తోంది. అయితే దీనిపై బీసీసీఐ నుంచి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే వరకు ఏదీ చెప్పలేం.




## ఆ బుల్లెట్టే ముద్దు!




రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంతో, తదుపరి కెప్టెన్ ఎంపికపై చర్చలు ఊపందుకున్నాయి. 1983 వరల్డ్ కప్ విజేత మదన్ లాల్, గిల్ కాకుండా బుమ్రా నాయకత్వానికి అనుకూలమని తెలిపారు. అయితే, బుమ్రా గాయాల సమస్య కారణంగా పూర్తి బాధ్యతలు ఇవ్వడం కుదరదని అంచనా. గిల్ స్టైలిష్ ఆట, స్థిరతతో తనను నిరూపించుకున్న నేపథ్యంలో, కెప్టెన్సీ కోసం పోటీ ఆసక్తికరంగా మారింది. భారత టెస్ట్ క్రికెట్‌లో నాయకత్వ మార్పులకు సంబంధించి ఈ మధ్యకాలంలో సంచలనాత్మక పరిణామాలు చోటు చేసుకున్నాయి. బుధవారం సాయంత్రం భారత కెప్టెన్ రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు తన రిటైర్మెంట్‌ను ప్రకటించడం ద్వారా క్రికెట్ ప్రపంచాన్ని షాక్‌కు గురిచేశారు. ఇంగ్లాండ్ పర్యటనకు ముందు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రోహిత్ తన అధికారిక సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ నేపథ్యంలో, తదుపరి భారత టెస్ట్ కెప్టెన్ ఎవరు అనే చర్చ జోరుగా నడుస్తోంది. అందులో భాగంగా 1983 వరల్డ్ కప్ విజేత జట్టు సభ్యుడు, మాజీ ఫాస్ట్ బౌలర్ మదన్ లాల్ తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ, యువ క్రికెటర్ శుభ్‌మాన్ గిల్ కాకుండా జస్‌ప్రీత్ బుమ్రా నాయకత్వ బాధ్యతలు చేపట్టడం సరైనదని అభిప్రాయపడ్డారు. బుమ్రా నిత్యం జట్టులో ఉంటూ నిరంతర ప్రదర్శన ఇస్తున్నాడని, అతను ఇప్పటి వరకు చూపిన పట్టు, అనుభవం భారత టెస్ట్ జట్టుకు ఉపయోగపడుతుందని మదన్ లాల్ వ్యాఖ్యానించారు.

# బ్రేవిస్ అదుర్స్

కోల్‌కతా: డెవాల్డ్ బ్రేవిస్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 52) మలుపుతిప్పే ఆటతో.. డిఫెండింగ్ చాంప్ కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్లేఆఫ్స్ అవకాశాలు దాదాపుగా ఆవిరయ్యాయి. బుధవారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ 2 వికెట్లతో కోల్‌కతాపై గెలిచింది. తొలుత కోల్‌కతా 20 ఓవర్లలో 179/6 స్కోరు చేసింది. రహానె (48), రస్సెల్ (38), మనీష్ పాండే (36 నాటౌట్) ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నూర్ 4 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో చెన్నై 19.4 ఓవర్లలో 183/8 స్కోరు చేసి గెలిచింది. శివమ్ దూబే (45), ఉర్విల్ పటేల్ (31) రాణించారు. వైభవ్ అరోరా 3 వికెట్లు తీశాడు. ఆశలులేని స్థితి నుంచి..: పవర్‌ప్లేలో 62/5తో టాప్-5 వికెట్లు చేజార్చుకొన్న చెన్నై.. మ్యాచ్‌పై దాదాపుగా ఆశలు వదిలేసుకొంది. కానీ, దూబేతో కలసి బ్రేవిస్ ఆరో వికెట్‌కు 67 పరుగులు జోడించడంతో ఒక్కసారిగా మ్యాచ్‌లోకి వచ్చింది. 11వ ఓవర్‌లో అరోరా బౌలింగ్‌లో చెలరేగిన బ్రేవిస్ 3 సిక్స్‌లు, 3 ఫోర్లతో 30 పరుగులు రాబట్టడం హైలైట్. అయితే, ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న బ్రేవిసను వరుణ్ అవుట్ చేశాడు. విజయానికి చివరి 5 ఓవర్లలో 40 రన్స్ అవసరమవగా.. ధోనీ (17 నాటౌట్), దూబే ఏడో వికెట్‌కు 43 రన్స్ భాగస్వామ్యంతో గెలుపుముంగిట నిలిపారు. దూబేను కూడా అరోరా అవుట్ చేసినా.. అన్షుల్ (4 నాటౌట్) ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. ఓపెనర్లు మాత్రె(0), కాన్వే (0) డకౌటవగా, ఉర్విల్‌ను హర్షిత్ అవుట్ చేశాడు. అశ్విన్ (8), జడేజా (19) నిరాశపర్చారు. దెబ్బకొట్టిన నూర్: స్పిన్నర్ నూర్ దెబ్బకు కోల్‌కతా ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. ఓపెనర్ గుర్బాజ్ (11) విఫలమైనా.. నరైన్ (26), రహానె రెండో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. దీంతో పవర్‌ప్లేను కోల్‌కతా 67/1తో ముగించింది. కానీ, 8వ ఓవర్‌లో నరైన్, రఘువంశీ (1)ని అవుట్ చేసిన నూర్ దెబ్బకొట్టాడు. రహానెను జడేజా బౌల్డ్ చేశాడు. ఈ దశలో రస్సెల్.. మనీషతో కలసి ధాటిగా ఆడుతూ స్కోరు వేగం పెంచాడు. అయితే, రస్సెల్, రింకూ సింగ్ (9)ను కూడా నూర్ అవుట్ చేశాడు.



# ఆర్సీబీలో ఏం జరుగుతోంది?

**ముగ్గురు స్టార్ ప్లేయర్లకు ఒకేసారి గాయాలు..! ఈ సారి కూడా నిరాశేనా..?**



ఐపీఎల్ 2025 చివరి దశలో, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు కీలక ఆటగాళ్ళ గాయాలతో అత్యంత కష్టకాలం ఎదుర్కొంటోంది. కెప్టెన్ రజత్ పాటిదార్, ఫిల్ సాల్ట్, జోష్ హాజిల్‌వుడ్ మరియు దేవదత్ పడిక్కల్ గాయాలతో బాధపడుతున్నారు. ఈ గాయాలు ఆర్సీబీ ప్లేఆఫ్స్ అవకాశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. పాయింట్ల పట్టికలో రెండవ స్థానంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు భారీ షాక్ తగిలింది. నిజానికి ఆర్సీబీలోని ముగ్గురు బిగ్ మ్యాచ్ విన్నర్లు అకస్మాత్తుగా గాయపడ్డారు. దీంతో ఈ సారి కూడా ట్రోఫీని గెలుచుకోవాలనే వారి కల కలగానే మిగిలిపోతుందనే భయం ఆర్సీబీ అభిమానుల్లో కలుగుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆర్సీబీ 11 మ్యాచ్‌ల్లో 8 గెలిచింది. కేవలం మూడింటిలో మాత్రమే ఓటమిని చవిచూసింది. మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో ఒక్కటి గెలిచినా అధికారికంగా ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటుంది. అయితే ఇటువంటి పరిస్థితిలో టీమ్‌లోని ముగ్గురు కీలక ఆటగాళ్లు గాయపడటం ఆర్సీబీని కలవరపెడుతోంది. కెప్టెన్ రజత్ పాటిదార్, ఓపెనర్ ఫిల్ సాల్ట్, ఫాస్ట్ బౌలర్ జోష్ హాజిల్‌వుడ్ గాయాలతో బాధపడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే గాయంతో దేవదత్ పడిక్కల్ జట్టుకు పూర్తిగా దూరం అయ్యాడు. అతని స్థానంలో మయాంక్ యాదవ్‌ను తీసుకుంది ఆర్సీబీ. అయితే పైన చెప్పుకున్న నలుగురు ఆటగాళ్లు ప్రస్తుతం ఫామ్‌లో ఉన్నారు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కెప్టెన్ రజత్ పాటిదార్ వేలికి గాయమైంది. దీంతో అతను లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో ఆడటం డౌటే. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ ఫిల్ సాల్ట్ వైరల్ జ్వరం కారణంగా గత రెండు మ్యాచ్‌లు ఆడలేకపోయాడు. అతను ఇంకా జ్వరం నుండి పూర్తిగా కోలుకోలేదు. అతని స్థానంలో జాకబ్ బెథెల్‌ను జట్టులో చేర్చారు. గత మ్యాచ్‌లో బెథెల్ అద్భుతమైన హాఫ్ సెంచరీ చేశాడు కాబట్టి ఒక ప్లేస్ అయితే సేఫ్. ఆర్సీబీలో మ్యాచ్ విన్నింగ్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ భుజం గాయం కారణంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆడలేకపోయాడు.



# ఇట్స్ న్యూ బిగినింగ్..

## సమంత ఆసక్తికర పోస్ట్

ఏమాయ చేసావేతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన సమంత ఆ సినిమా సూపర్ హిట్ తో బ్యాక్ టు-బ్యాక్ సినిమాలతో స్టార్ హీరోయిన్ గా మారింది. ఆ దశలోనే అక్కినేని వారి వారసుడు నాగచైతన్య తో ప్రేమాయణం, పెళ్లి.. విడాకులు ఇలా అన్ని చకచకా జరిగిపోయాయి. చైతు నుండి విడాకులు తీసుకున్నాక టాలీవుడ్‌కు దూరంగా ఉంటూ వస్తోంది సమంత. అదే టైమ్ లో బాలీవుడ్ లో ఫ్యామిలీ మెన్ సిరీస్ తో సూపర్ హిట్ అందుకుంది. ఈ సిరిస్ తో ప్రశంసలతో పాటు- ఆ సిరిస్ దర్శకులలో ఒకరైన రాజ్ నిడమోరుతో ప్రేమలో పడిందనే ఆరోపణలు ఎదుర్కొంది సమంతా. రాజ్.. సమంతలు రిలేషన్ లో ఉన్నారనే టాక్ నడిచింది. ఓ వైపు సామ్ మొదటి భర్త నాగ చైతన్య మరో పెళ్లి చేసుకోవడంతో సమంత కూడా పెళ్లి పీటలు ఎక్కబోతుందని వార్తలు హల్ చల్ చేసాయి. కానీ అవన్నీ గాసిప్ లాగే మిగిలాయి. కానీ ఇప్పుడు లేటె-స్ట్ గా సమంత ' ఇది చాలా కష్టమైన ప్రయాణం. కానీ ఇక్కడి వరకూ చేరుకున్నాం. ఇట్స్ న్యూ బిగినింగ్ ' అని పోస్ట్ చేస్తూ దర్శకుడు రాజ్ నిడిమోరుతో దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇక సమంత నిర్మించిన శుభం మే 9న విడుదల కానుంది. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహించాడు. ఈయన డైరెక్ట్ చేసిన తొలిసినిమా 'సినిమా బండి' కి రాజ్ నిడిమోరు నిర్మాతగా వ్యవహరించగా రెండవ సినిమాను సమంత నిర్మించడం కొసమెరుపు. ఇంతకీ సమంత చెప్పిన ఆ న్యూ బిగినింగ్ లోగుట్టు ఏమిటో వేచి చూడాల్సిందే.



# హరిహరవీరమల్లు షూటింగ్ పూర్తి

## జూన్ 12న విడుదలకు డేట్ ఫిక్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్‌కి బిగ్ అప్‌డేట్ వచ్చింది. హరిహర వీరమల్లు సినిమా షూటింగ్ ఫైనల్‌గా కంప్లీట్ అయిపోయింది. ఎన్నో అవాంతరాల తర్వాత ఈ మూవీ రిలీజ్ డేట్ గురించి క్లారిటీ- వచ్చేసింది. మొదట మే 9 అని అధికారికంగా అనౌన్స్ చేసినా, షూటింగ్ జస్ట్ రెండు మూడు రోజుల క్రితమే ముగిసింది కాబట్టి, అంత తొందరగా రిలీజ్ చేయడం కాస్త కష్టమే. ఇప్పుడు తాజా బజ్ ఏంటంటే, ఈ సినిమా జూన్ 12న థియేటర్స్‌లో సందడి చేయబోతోంది! ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేస్తూ లీడింగ్ టికెట్ సెల్లింగ్ ఎ÷-లాట్‌ఫాం బుక్ మై షో జూన్ 12 డేట్‌తో 'కమింగ్ సూన్' అంటూ ఫైర్ అనౌన్స్‌మెంట్ ఇచ్చేసింది. సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఇప్పటికే హైప్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఈ సినిమా షూటింగ్ స్టార్ట్ అయ్యి దాదాపు నాలుగేళ్లు అవుతోంది. 2020లో అనౌన్స్ అయిన హరిహర వీరమల్లు షూటింగ్‌లో కోవిడ్ పాండమిక్, పవన్ కళ్యాణ్ రాజకీయ కమిట్‌మెంట్స్ వల్ల బోలెడు డిలేస్ ఫేస్ చేసింది. ఆయన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ- సీఎంగా బిజీగా ఉండటంతో షూటింగ్ కాస్త స్లో అయింది. అయినా, 2024 సెప్టెంబర్‌లో విజయవాడలో సెట్‌లో షూటింగ్ రీస్టార్ట్ అయ్యి, మే 6, 2025 నాటికి ఫైనల్‌గా ర్యాప్ అయిపోయింది. ఇప్పుడు పోస్ట్-ప్రొడక్షన్, ÷ఎఎ÷ృ, డబ్బింగ్ వర్క్ ఫుల్ స్పీడ్‌లో జరుగుతోంది. పవన్ కళ్యాణ్ -టైటిల్ రోల్‌లో వీరమల్లుగా కనిపించబోతున్నాడు. బాబీ డియోల్ మొగల్ బాద్‌షా ఔరంగజేబ్‌గా విలన్ రోల్‌లో కనిపిస్తారు. నిధి అగర్వాల్ లీడ్ హీరోయిన్‌గా, అనుపమ్ ఖేర్, నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహి లాంటి స్టార్ కాస్ట్ ఈ మూవీలో ఉన్నారు. డైరెక్షన్ క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ కాంబోలో జరిగింది. సినిమాకి ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్ ఇచ్చారు, ఇప్పటికే 'మాట వినాలి', 'కొల్లగొట్టినాదిరో' సాంగ్స్ రిలీజ్ అయి ట్రెడ్ అయ్యాయి.

# పిల్లలను కనడం.. ఓ పెద్ద టాస్క్: దీపిక



బాలీవుడ్‌లో తమదైన నటతో స్టార్స్‌గా ఎదిగారు దీపికా పదుకుణె-రణ్‌వీర్ సింగ్. సినిమా పరిశ్రమలో ఈ జంట తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పటికీ బాలీవుడ్ లో భారీ రెమ్యూనరేషన్ తీసుకునే టాప్ స్టార్లలో వీరిద్దరూ ఉంటారు. ఇక మూడుముళ్ల బంధంతో ఒక్క-టైన ఈ జంట తమ ఆరేళ్ల వైవాహిక బంధానికి ప్రతీకగా, ఈ ఏడాది సెప్టెంబర్ లో పండంటి ఆడబిడ్డని తమ జీవితంలోకి ఆహ్వానించారు. దీంతో ఈ బాలీవుడ్ లవ్లీ కపుల్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్నా అంటూనే దీపికా తిరిగి తన కెరీర్ ను మొదలు పెట్టింది. ఒప్పుకున్న సినిమాలు కంప్లీట్ చేసే పనిలో పడింది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ దీపిక రణ్ వీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. దీపిక మాట్లాడుతూ.. 'పెళ్లయిన కొత్తలో ఓ సారి పిల్లలను కనడం గురించి రణ్‌వీర్ తో మాట్లాడుతూ.. ఎప్పుడు ప్లాన్ చేద్దాం అని అడిగాను. దానికి ఆయన సమాధానం ఇస్తూ.. పిల్లలను కనడం ఇద్దరి నిర్ణయం అయినప్పటికీ.. మోయాల్సింది నువ్వు మాత్రమే. బేబీ నీ శరీరంలోనే పెరుగుతుంది. కాబట్టి నువ్వే నిర్ణయం తీసుకోవాలి. పిల్లలను కనగలను అని నీకు ఎప్పుడు అనిపిస్తే అప్పుడు ప్లాన్ చేద్దాం అన్నారు. ఆయన మాటలు నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయి' అని దీపికా చెప్పుకొచ్చింది.

# నా మహాభారతంలో నేనే కృష్ణుడిని

## మనసులో మాట వెల్లడించిన అమీర్ ఖాన్



మహాభారంతం కల నెరవేర్చే క్రమంలో బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ ఒక్కో విషయం వెల్లడిస్తున్నాడు. అతిపెద్ద పాన్ ఇండియా ప్రాజెక్ట్ అయిన మహాభారతంపై ఎప్పటికప్పుడు వార్తలు వస్తూనే ఉన్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్ తన డ్రీమ్ అని అమిర్ ఖాన్ ఇప్పటికే చాలా సార్లు ప్రకటించారు. ఇక తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి మరోసారి స్పందించారు అమీర్ ఖాన్. 'ఈ సినిమాను ఈ ఏడాదిలోనే ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఇందులో నాకు కృష్ణుడి పాత్ర చేయాలని ఉంది. ఆ పాత్ర నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. ఒక పాత్రలో ఇన్ని రకాల వేరియేషన్స్ ఉంటాయా అనిపించేలా ఉంటుంది కృష్ణుడి పాత్ర. ఆ పాత్రలో నటించడం చాలా కష్టం. అందులో ఉండే అన్ని షేడ్స్ విభిన్నంగా ఉంటాయి. అందుకే ఆ పాత్ర చేయాలని ఉందని తెలిపారు. ఈ మహాభారతంను ఒక మూవీలో చూపించలేం. దాన్ని కొన్ని భాగాలుగా చూపించొచ్చు. ఆ మూవీ స్క్రిప్ట్ కోసమే కొన్నేళ్ల టైమ్ పడుతుంది. త్వరలోనే అది నెరవేరుతుందని ఆశిస్తున్నాను. ప్రస్తుతం సినిమాల పరంగా కొంత స్పీడ్ తగ్గింది. కానీ నా సినిమాల కోసం ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలో అన్ని తీసుకుంటున్నాను. నా సినిమాల్లో నేను లాభాల్లో షేర్ తీసుకుంటాను. హిట్ అయితే మాత్రమే ఈ షేర్ తీసుకుంటా. ఒకవేళ ఫ్లాప్ అయితే ఒక్క రూపాయి కూడా తీసుకోను. ఎందుకంటే సినిమా నష్టాల్లో కూడా నేను బాధ్యత తీసుకోవాలి అనుకుంటాను' అంటూ చెప్పుకొచ్చాడు అమిర్ ఖాన్. మొత్తంగా మహాభారతం ఎలా తీస్తారన్న ఆసక్తి నెలకొంది.



# అది తట్టుకోలేక డిప్రెషన్ లోకి వెళ్లా

మోడల్ గా కెరీర్ ను స్టార్ట్ చేసిన శ్రీనిధి శెట్టి ఆ తర్వాత హీరోయిన్ గా మారింది. కానీ ఆ గ్యాప్ లో కెరీర్లో ఎదగడానికి శ్రీనిధి చాలానే కష్టపడింది. తన జర్నీలో ఎన్నో బాధలను అధిగమించి ఈ స్థాయికి చేరానని చెప్పిన శ్రీనిధి చిన్నతనంలోనే తల్లిని కోల్పోయి కొన్నాళ్ల పాటూ డిప్రెషన్ లోకి కూడా వెళ్లిందట. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీనిధి తన తల్లి గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయింది. శ్రీనిధి టెన్త్ క్లాస్ చదువుతున్నప్పుడే తన తల్లి చనిపోయిందట. ఆ షాక్ ను తట్టుకోలేక కొన్నాళ్ల పాటూ డిప్రెషన్ లోకి వెళ్లానని చెప్తున్న శ్రీనిధికి ఆ టైమ్ లో ఇంట్లో ఉండాలనిపించలేదని, గతాన్ని మర్చిపోయేందుకు బెంగుళూరుకు వెళ్లానని, అయినా తల్లిని మర్చిపోలేకపోయానని, చాలా రోజులు ఆమెను తలుచుకుంటూ ఏడ్చానని, ఆ విషాదం నుంచి బటయపడటానికి చాలానే టైమ్ పట్టిందని, తల్లి చనిపోయాక తండ్రి తనకెంతో సపోర్ట్ గా నిలిచారని శ్రీనిధి తెలిపింది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463